# వైఎస్ఆర్-అన్నమయ్య

తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

ఆదివారం 08 జూన్ 2025


## డిసిసిబి,డిసిఎంఎస్ చైర్మన్ లను అభినందించిన జగన్ రాజు

**రాజంపేట అర్బన్, జూన్ 7 ప్రభాతవార్త**

డిసిసి బ్యాంక్ చైర్మన్ సూర్యనారాయణ రెడ్డిని, డీసీఎంఎస్ చైర్మన్ జయప్రకాష్ ను తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు చెమట జగన్మోహన్ రాజు అభినందించారు. కడప జిల్లా వీరిద్దరి ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇద్దరికీ దుశ్శాలువ కప్పి, పుష్పగుచ్ఛం ఇచ్చి సన్మానించారు. తెలుగుదేశం పార్టీలో కష్టపడే ప్రతి పసుపు సైనికునికి కులమతాలకతీతంగా కడప జిల్లాలో వారికి పదవులు రావడం చాలా సంతోషంగా ఉందన్నారు.



## హిందీ గీతాలకు అలరించిన చిన్నారుల నృత్యాలు..

**కడప కార్పొరేషన్ జూన్ 7 ప్రభాతవార్త:**

బక్రీద్ పండుగ సందర్భంగా శనివారం కడప శిల్పారామంలో సాంస్కృతి కళా వేదిక మీద డ్రీం మీడియా వారి సహకారంతో కడప నగరానికి చెందిన విజయశాంతి ముద్ర డాన్స్ వారి బృందం తెలుగు సాంప్రదాయ వస్త్రధారులతో శాస్త్రీయ నృత్యాలు, పల్లె జానపదాలు, హిందీ సాంగ్ లతో ప్రేక్షకులను అలరించారు. ఈ సంస్కృతి కార్యక్రమాలను శిల్పారామం పరిపాలన అధికారి ఎస్.కృష్ణ ప్రసాద్ పర్యవేక్షణలో చేశారు.



### రోడ్డు ప్రమాదాల నివారణపై

# ప్రత్యేక చర్యలు చేపట్టాలి

### డిటిసి కార్యాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి

**కడప, జూన్ 7 ప్రభాతవార్త :**

రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేక చర్యలు చేపట్టాలని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం కడప పట్టణంలోని ఉప రవాణా కమిషనర్ వారి కార్యాలయాన్ని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ రవాణా శాఖ అధికారులు సిబ్బంది సమన్వయంతో పనిచేసి రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాలను పూర్తిగా నివారించేందుకు ప్రజలకు ట్రాఫిక్ రూల్స్ గురించి పూర్తి అవగాహన కల్పించాలన్నారు. ప్రాణం ఎంతో విలువైనదని, రోడ్డు ప్రమాదాల మూలంగా ఏ ఒక్కరూ ప్రాణాలు కోల్పోయే పరిస్థితులు లేకుండా జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణ చర్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. రోడ్డు భద్రత కమిటీలోని ప్రభుత్వ శాఖలన్నీ సమన్వయంతో పని చేసి ప్రమాదాలను పూర్తిగా అరికట్టాలన్నారు. ఈ సందర్భంగా మంత్రివర్యులు కార్యాలయంలోని రికార్డులను పరిశీలించారు. అనంతరం కార్యాలయపు సిబ్బందితో మాట్లాడి మీకు ఎలాంటి సమస్యలున్న వెంటనే తమకు తెలియజేసి పరిష్కరించుకోవచ్చు అని వారికి తెలిపారు.



## ప్రజల సమస్యలు అక్కడికక్కడే పరిష్కారం

**చిన్నమండెం, జూలై 7 ప్రబాతవార్త :**

ప్రజాదర్బార్ కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలు అక్కడికక్కడే పరిష్కరిం చడం జరుగుతుందని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. శని వారం చిన్నమండెం మండలం బోరెడ్డి గారిపల్లెలోని తమ నివాసం నందు మంత్రి ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత ఎన్నో ఏళ్లుగా రాయచోటి నియోజకవర్గంలో సమస్యలు పరిష్కారానికి నోచుకోక ప్రజలు నానా ఇబ్బందులు ఎదుర్కొనే వారని ప్రభు త్వం ఏర్పడిన తర్వాత ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకు వెళుతున్నామన్నారు. అన్నమయ్య జిల్లాలో ఎక్కువగా గత ప్రభుత్వంలో జ రిగిన అక్రమాలు, భూ కబ్జాలు మీద అధికంగా ఫిర్యాదులు వస్తున్నాయని వీ టిపై ఎప్పటికప్పుడు సంబంధిత అధికారులకు ఫోన్ చేసి పరిష్కరించడం జరు గుతుందన్నారు. మంత్రివర్యులు జిల్లాకు వచ్చినప్పటి నుంచి నిరంతరం ప్రజల కు అందుబాటులో ఉంటూ వారి సమస్యలు పరిష్కరిస్తున్నారు. అంతేకాకుం డా ఎల్ల వేళలా ప్రజలతో మమేకమై వారిని ఆప్యాయంగా పలకరిస్తూ సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత నిస్తున్నారు. దీంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల అర్జీలు స్వీకరించి వాటిని అక్కడికక్కడే పరిష్కరించడం జరిగింది.



## తెలుగుదేశం పార్టీకి షాక్...

### సుగవాసి బాలసుబ్రమణ్యం పార్టీకి రాజీనామా



రాజీనామా చేసిన సుఖవాసి బాలసుబ్రమణ్యం



తెలుగుదేశం పార్టీలోనే కొనసాగుతా.. ప్రసాద్ బాబు

**రాజంపేట అర్బన్, జూన్ 7 ప్రభాతవార్త :**

అన్నమయ్య జిల్లా లో టీడీపీ కి బిగ్ షాక్. గత ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ రాజంపేట అసెంబ్లీ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయిన మాజీ ఎంపీ సుగవాసి పాలకొండ్రాయుడు తనయుడు సుగవాసి బాలసుబ్రమణ్యం తెలుగుదేశం పార్టీకి రాజీనామా చేశారు. ఈ మేరకు పార్టీ అధ్యక్షులు చంద్రబాబునాయుడుకి రాజీనామా లేఖను పంపారు. ప్రజలు, పాలకొండ్రాయుడు అభిమానులు సలహాలు, సూచనలు అభిప్రాయాలు, మనోభావాలను గౌరవిస్తూ రాజీనామా చేస్తున్నట్లు ప్రకటన విడుదల చేశారు. గత కొంతకాలంగా పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్న బాలసుబ్రమణ్యం ఎట్టకేలకు మౌనం వీడారు. పార్టీలో ప్రాథమిక లేకపోవడం ఆయన్ను తీవ్ర మనోవేదనకు గురిచేసింది. మన వైపు తండ్రి పాలకొండ్రాడు మరణం తర్వాత దారి తీసిన పరిస్థితులు కూడా బాలసుబ్రమణ్యం రాజీనామాకు దారి తీసినట్టు తెలుస్తోంది. గత నెల 27, 28 ,29 తేదీల్లో కడపలో జరిగిన మహానాడులో సుగువాసి కుటుంబానికి ఆశించిన స్థాయిలో ఆదరణ లభించలేదు. నాలుగు దశాబ్దల సుదీర్ఘ రాజకీయ ప్రస్థానం చేసిన పాలకొండ్రాయుడు మరణం తర్వాత కనీసం ఆయన కుటుంబాన్ని పరామర్శించేందుకు కూడా జిల్లాకు వచ్చిన తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కానీ యువ నేత నారా లోకేష్ కానీ రాకపోవడం వారిని మరింత కలతకు గురి చేసింది. 40 సంవత్సరాలు తెలుగుదేశం పార్టీకి అంటిపెట్టుకొని సేవలను అందించిన కుటుంబానికి ఇలా జరగడంపై సుగవాసి వర్గం తీవ్ర ఆగ్రహంతో ఉంది. పార్టీ అధికారంలోకి వచ్చాక పాలకొండ్రాయుడు కుటుంబానికి జరుగుతున్న అవమానాలపై దృష్టి పెట్టని చంద్రబాబు. రాయచోటి పర్యటనలో సైతం ప్రాధాన్యత ఇవ్వలేదు. తరచుగా అవమానాలు జరుగుతున్నా పార్టీలో కొనసాగుతూ వచ్చిన పాలకొండ్రాయుడు కుటుంబం. కట్టె కాలే వరకూ పార్టీలోనే కొనసాగుతానని శపథం చేసిన పాలకొండ్రాయుడు. చంద్రబాబుతో సమకాలిన రాజకీయాలు చేసి, ఆరోగ్యం సహకరించకపోయినా గడచిన ఎన్నికల్లో రాంప్రసాద్ రెడ్డి గెలుపు కోసం వీల్ చైర్ లో ప్రచారం చేశారు. సామాజిక మాధ్యమాల్లో సైతం పార్టీ అధిష్టానంపై సుగవాసి వర్గీయులు తీవ్ర విమర్శలను గుప్పించారు. ఈ నేపథ్యంలోరాజంపేట రాజకీయాల్లో బాలసుబ్రమణ్యం రాజకీయం ఏ పరిణామాలకు దారితీస్తుందో వేచి చూడాల్సి ఉంది. తెలుగుదేశం లోనే కొనసాగుతా ... సుగవాసి ప్రసాద్ బాబు నిర్ణయం..!!తెలుగుదేశం పార్టీకి తన అన్న సుగవాసి బాలసుబ్రమణ్యం రాజీనామాపై ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ కార్యదర్శి సువాసి ప్రసాద్ బాబు స్పందించారు. రాజీనామా ఆయన వ్యక్తిగత నిర్ణయమని స్పష్టం చేశారు. నియోజకవర్గం లో పరిస్థితులు ఆయనను కలచివేసి ఉంటాయని భావిస్తునట్టు తెలిపారు. అయితే పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత సుగవాసి కుటుంబాన్ని ఇబ్బంది పెడుతున్న వారిని ఎవరినీ వదిలిపెట్టమని కుండబద్దలు కొట్టారు.

## అభయాంజనేయ స్వామి వార్షికోత్సవానికి రాజంపేట పార్లమెంట్ఇంచార్జి హాజరు

### బండలాగుడు పోటీలను ప్రారంభించిన జగన్మోహన్రాజు:

**ఒంటిమిట్ట జూన్ 07( ప్రభాతవార్త)**



ఒంటిమిట్ట మండలం కొనరాచపల్లె గ్రామంలో ప్రతిష్టించిన అభయాంజనేయ స్వామి తృతీయ వార్షికోత్సవానికి రాజంపేట పార్లమెంట్ ఇంచార్జి చమర్తి. జగన్మోహన్ రాజు శనివారం దర్శించడం జరిగింది. ఈ సందర్భంగా గ్రామస్తులు ఆయనకు గజమాలతో, భాణసంచాలతో స్వాగతం పలికి ఆలయం వద్దకు తీసుకు వెళ్లడం జరిగింది. ఆయన గోత్రనామాలతో స్వామివారికి ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. అర్చకులు తీర్థ ప్రసాదాలు అందించారు. గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. ఆంజనేయ స్వామి తృతీయ వార్షికోత్సవం సందర్భంగా గ్రామస్తులే కాకుండా పలు ప్రాంతాలకు చెందిన ప్రజలు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించుకుని వార్షికోత్సవాన్ని విజయవంతంగా పూర్తి చేశారు. అదేవిధంగా ఈ సందర్భంగా గ్రామస్తులు బండలాగుడు పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో గెలుపొందిన వృషభరాజముల యజమానులకు బహుమతులు ప్రధానం చేశారు. మొదటి బహుమతి కింద 50,000 వేల రూపాయలు పార్లమెంట్ ఇన్చార్జి జగన్ మోహన్ రాజు ప్రకటించారు. రెండవ బహుమతి కింద గీతాంజలి విద్యాసంస్థల అధినేత రమణ 40,000 వేల రూపాయలు ఇవ్వడం జరిగింది. అదేవిధంగా మూడో బహుమతి కింద ఒంటిమిట్ట మండల టిడిపి అధ్యక్షుడు గజ్జల. నరసింహారెడ్డి, మరియు కాంట్రాక్టర్ ఎస్ .వెంకటరమణ 30,000 వేల రూపాయలు ఇవ్వడం జరిగింది. ఆంజనేయ స్వామిని దర్శించుకొనుటకు వచ్చిన భక్తులకు నిర్వాహకులు అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. బండ లాగుడు పోటీలలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా స్థానిక పోలీసులు గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు టిడిపి నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



## త్యాగం, దానగుణాలకు ప్రతీక "బక్రీద్"

### బక్రీద్ ప్రార్థనల్లో పాల్గొన్న టిడిపి యువ నాయకులు నిశ్చల్ నాగిరెడ్డి

**రాజంపేట అర్బన్, జూన్ 7 ప్రభాతవా ర్త**

సమాజ హితం కోసం మహమ్మద్ ప్రవక్త హాజరత్ ఇబ్రహీం త్యాగనిరతికి ప్రతీకగా జరుపుకునే బక్రీద్ పండుగ.. దానం, సాయం, త్యాగం వంటి సుగుణాలను ప్రతిబింబింపజేస్తుందని ఈ పండుగ సమస్త మానవాళికి ఆదర్శనీయమని రాష్ట్ర రవాణా, యువజన మరియు క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తనయుడు టిడిపి నాయకులు నిచ్చల్ నాగిరెడ్డి పేర్కొన్నారు. శనివారం బక్రీద్ పండుగ సందర్భంగా రాయచోటి పట్టణంలోని ఈద్గాలో ముస్లిం సోదరులు నిర్వహించిన సామూహిక ప్రార్ధనలలో టిడిపి యువ నాయకులు నిచ్చల్ నాగిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. త్యాగానికి ప్రతీకగా బక్రీద్ పండుగను ప్రపంచ వ్యాప్తంగా ముస్లీంలు జరుపు కుంటారన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాలనలో ప్రజలు సుభిక్షంగా ఉండాలని సంక్షేమ పాలనలో ముఖ్యమంత్రికి అల్లా ఆశీస్సులు ఉండాలని ఆకాక్షించారు. ప్రతి మనిషి తనకు ఉన్నంతలో తోటి మనిషికి సాయం అందించే స్వభావాన్ని అలవర్చుకోవాలని నిచ్చల్ నాగిరెడ్డి ప్రజలకు సందేశానిచ్చారు. బక్రీద్ ప్రార్ధన అనంతరం నిచ్చల్ నాగిరెడ్డి ప్రజలకు బక్రీద్ పండుగ శుభాకాక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాయచోటి పట్టణంలోని ముస్లిం మత పెద్దలు, ముస్లింలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.



మంత్రి కుమారుడు నిచ్చల్ నాగిరెడ్డి



బక్రీద్ పండుగ సందర్భంగా కడప ఈద్గాలో ప్రార్థనలలో ముస్లిం మత పెద్దలు, ముస్లింలు


# శ్రద్ధాంజలి



శ్రీ పి ముత్తుస్వామి గారు
శేఖర్ స్వీట్స్, మదనపల్లి

మరణం :
06.06.2025

అంత్యక్రియలు : 08.06.2025 ఉ॥ 9 గం॥లకు
స్థలం : స్వగృహం, రోజా ఫ్లాట్స్, మదనపల్లి నుండి
బయలుదేరి, గారబురుజు నందుఅంత్యక్రియలు

ఇట్లు :
బంధుమిత్రులు
కుటుంబ సభ్యులు


## "మామిడెంత మధురం"... - మామిడి రైతులకు ప్రోత్సాహకం కరువు

**మదనపల్లె, జూన్ 7 ప్రభాతవార్త :**

పండ్లల్లో రారాజు మామిడిపండు...మామిడిపండు అమృతంతో సమానంగా ఉదహరిసాతరు. అరుచి ఆమోఘం..అద్భుతం, అనిర్వచనీయం. పసుపుపచ్చని రంగులో నిగనిగలాడే మామిడి ఫలాలనుచూస్తే ఆరేళ్ళ చిన్నారి నుంచి అరవైఏళ్ల ముదుసలి వరకు మామిడిపండును చూస్తే లొట్టలేస్తారనడంలో ఎటువంటి అతిశయోక్తిలేదు. మామిడిపండు రుచి చూడకపోయినా, మామిడిపచ్చడి తినకపోయినా ఆ జీవితం వృధా అనే నానుడి సైతం ప్రచారంలో ఉందంటే మామిడి ప్రాముఖ్యత ఏ పాటిదో ఇట్టే అర్థమౌతుంది. మామిడిపళ్ళ సీజన్లో మామిడి ఫలాలను ఆరగించని వారుండరంటే బహుశా అతిశయోక్తికాదేమో. ఇంతటి ప్రాధాన్యత కలిగిన మామిడి ఫలాలకు దేశంలోనే మన రాష్ట్రం ప్రసిద్ధి. అందులోనూ అన్నమయ్యజిల్లాలోని తూర్పు ప్రాంతంలో అధికంగా లభించే బేనీషా, ఎర్రనీలం, మల్గూబ, చక్కెరగుత్తి వంటి మామిడి ఫలాలకు ఎంతో ప్రత్యేకత ఉంది. దేశ, విదేశ ప్రముఖులు మనస్సును సైతం మన మామిడి దోచేసింది. ఇంతటి ఘన చరిత్ర కలిగిన మధురఫలాలు నేడు తమ సహజత్వాన్ని కోల్పోయి నాణ్యత లేమిగా, అధిక ధరలతో సామాన్య, మద్యతరగతి ప్రజలకు అందుబాటులో లేకుండాపోయాయి. వ్యాపారులు తమ స్వార్ధ ప్రయోజనాల కోసం మధురఫలాలైన మామిడిని విషతుల్యంగా మారుస్తున్నారు. అత్యధికంగా రసాయన



మల్గూబ మామిడి తోపు



మార్కెట్లో లభిస్తున్న మామిడి

వినియోగాలతో పంట పండించడం సహజంగా మాగాల్సిన మామిడిపండ్లను విషతుల్యమైన కార్బైడ్ ద్వారా మాగిస్తూ వినియోగదారుల ఆరోగ్యాలతో చెలగాటమాడుతున్నారు. ఇంకా పలు రకాలైన రెడ్డిపసంద్, దిల్పసంద్, బెంగుళూర తదితర రకాలు పూర్తిగా నాణ్యతలేమిగా దొరుకుతున్నాయని వినియోగదారులు వాపోతున్నారు. అంత జరుగుతున్నా అధికారులు మాత్రం చోద్యం చూస్తుండడం గమనార్హం. మరోవైపు ప్రతి ఏడాది మామిడిపండ్లు దిగుబడి కూడా తగ్గిపోవడంతో మంచి రకాలైన మామిడిపండ్లు సామాన్య, మధ్య తరగతి ప్రజలకు అందనంత ఎత్తులో ఉన్నాయని వినియోగదారులు వాపోతున్నారు. జూన్ సీజన్లో ఒకప్పుడు కోట్లాదిరుపాయల వ్యాపారం జరిగేదని ప్రస్తుతం చాలా వరకు తగ్గిందని వ్యాపారులు పేర్కొంటున్నారు. ప్రభుత్వం మామిడిరైతులకు ప్రోత్సాహాన్ని అందించడంలో నిర్లక్ష్యం వహిస్తుండడం వల్లే మామిడిపండ్లు పెంపకం విస్తీర్ణం తగ్గుతోందని పలువురు ఆరోపిస్తున్నారు. వేలాది ఎరాల్లో సాగయ్యే మామిడి, ప్రస్తుతం వందల ఎకరాల్లో కూడా కనిపించని పరిస్థితి నెలకొంది. మరోవైపు మామిడిపండించే రైతులకు ధర గిట్టుబాటు కాకపోగా, వ్యాపారులు మాయాజాలంతో మార్కెట్లో అధిక ధరలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

## న్యాక్‌లో ఏ గ్రేడ్ సాధించిన నాగభూషణం కళాశాల



**గోపవరం, జూన్ 7, ప్రభాతవార్త**

నియోజకవర్గంలోనే నాక్ (నేషనల్ అసెస్మెంట్ అండ్ అక్రిడేషన్ కౌన్సిల్) లో ఏ గ్రేడ్ సాధించి న ఏకైక విద్యాసంస్థ శ్రీ రాచపూడి నాగభూషణం కళాశాల అని కళాశాల కరస్పాండెంట్ సాయి కృష్ణ పేర్కొన్నారు. అటానమస్ కళాశాలక గుర్తింపు పొందింది అన్నారు. అటానమస్ అనగా సిలబస్ నీ రూపొందించటం, ప్రశ్నాపత్రాలను తయారు చేయటం, ప్రశ్నాపత్రాల మూల్యాంకనం కళాశాల ఆధ్వర్యంలోనే జరుగుతాయన్నారు. బద్వేల్ పరిసర ప్రాంత ప్రజలకు కొన్ని దశాబ్దాలుగా నాణ్యమైన విద్యను అందిస్తూ వస్తుంది. ఎప్పటికప్పుడు కాలానుగుణంగా విద్యా బోధనలలో సాంకేతిక మార్పులను తీసుకొస్తూ, వృత్తిపరమైన విద్యలను ప్రోత్సహిస్తూ , విద్యార్థులకు చదువుతోపాటు ఎన్సిసి లోని మూడు వింగ్స్ (నేవీ, ఆర్మీ, ఎయిర్ ఫోర్స్) లో చేరే అవకాశాలని కల్పిస్తూ బద్వేల్ పరిసర ప్రాంత ప్రజలకి సేవలందిస్తున్న తమ కళాశాలను గుర్తించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా తమకు అవకాశం కల్పించిన అధికారులకు, ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యాశాఖ అధికారులకి, యోగివేమన విశ్వవిద్యాలయ అధికారులకి, కళాశాల అధ్యాపక బృందానికి కళాశాల యాజమాన్యం తరపున ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## మామిడికాయల లారీ బోల్తా



**దువ్వూరు, జూన్ 07, ప్రభాతవార్త:**

మండల పరిధిలోని ఇడమడక గ్రామం వద్ద కడప-కర్నూలు జాతీయ రహదారిపై శనివారం మామిడికాయల లారీ అదుపు తప్పి బోల్తా పడింది. అయితే ఈ ప్రమాదంలో ఎవరికి ఎటువంటి గాయాలు కాలేదు. వివరాల్లోకి వెళితే...తిరుపతి నుండి హరియాణాకు మామిడి కాయల లారీతో వెళ్తు ఇడమడక చెక్ పోస్ట్ వద్ద అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో లారీలోని మామిడికాయలన్ని చెల్లాచెదురు అయ్యాయి. చెక్ పోస్ట్ వద్ద ఉన్న పోలీస్ సిబ్బంది సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. రహదారికి అడ్డంగా లారీ పడటంతో కొద్దిసేపు ట్రాఫీక్‌కు ఇబ్బంది ఏర్పడింది. లారీని పక్కకు జరిపి ట్రాఫీక్‌ను పునరుద్ధరించారు.

## దువ్వూరుకు 2 ప్రతిభా అవార్డులు

**దువ్వూరు, జూన్ 07, ప్రభాతవార్త:**





మండల కేంద్రమైన దువ్వూరులోని శ్రీ షిర్డిసాయి హైస్కూల్‌లో చదువుతున్న ఇద్దరు విద్యార్థులకు 2024-25 సంవత్సరానికి గాను ట్రైనింగ్ సోర్స్ పథకం కింద రెండు ప్రతిభా అవార్డులు వచ్చినట్లు కరస్పాండెంట్ లోకేష్ తెలిపారు. షిర్డిసాయి హైస్కూల్‌లో చదువుతున్న రిషిత, రాకేష్‌లకు 10వ తరగతీ పరీక్షా ఫలితాల్లో మంచి మార్కులు సాధించడంతో ఈ అవార్డులు లభించాయన్నారు. ఈ అవార్డులు రావడం పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మస్తాన్, చైర్మెన్ నరసింహులు అభినందించారు. అలాగే దువ్వూరులోని కస్తూరిబా బాలికల పాఠశాల యందు చదువుతున్న లలితకు కూడ ప్రతిభా అవార్డు వచ్చినట్లు పాఠశాల అధికారి మల్లేశ్వరి తెలిపారు.

## ఇంటర్ ఇంప్రూవ్మెంట్ ఫలితాలలో
## శ్రీవిద్యా" విద్యార్థుల విజయ కేతనం



**ప్రొద్దుటూరు అర్బన్, జూన్ 7, ప్రభాతవార్త :**

స్థానిక సూపర్ బజార్ రోడ్డులోని శ్రీ విద్యా జూనియర్ కళాశాల విద్యార్థులు శనివారం విడుదల చేసిన ఇంటర్ ప్రథమ సంవత్సరం ఇంప్రూవ్మెంట్ ఫలితాలలో యమ్.పి.సి మరియు బై.పి.సి. గ్రూపులో విజయభేరి మోగించారని ప్రిన్సిపల్ కె.ఒ.వి.రమణా రావు తెలిపారు. ఈ ఫలితాలలో ఎంపీసీ విభాగంలో 470 కి గాను తమ కళాశాల విద్యార్థులు కె.టి. గణేష్ 467, సి.ఎం. చందన 466, సి. రంగ హర్షవర్ధన్, సుమయా సుల్తానా, ఎం. పూజిత, ఎం. పుష్పలత, ఎస్. రుక్సానా, మహ్మద్ షెహజాద్, కృష్ణతేజ, హదీల్, తేజ శ్రీ, ఈశ్వర్ 465 మార్కులు సాధించారని, బైపిసి విభాగంలో 440 మార్కులకు గానూ ఎస్. తౌషిఫ్ సుల్తానా, పవన్ కుమార్ 435, అంజుమ్, సోమేశ్వరీ, మహిత 433, ఖాదీజున్ 432, అక్షయ తేజ 431, మైథిలీ రెడ్డి 430 మార్కులు సాధించారని వివరించారు. ఇంతటి ఘనవిజయాన్ని సాధించిన విద్యార్థిని, విద్యార్థులకు మరియు వారి తల్లిదండ్రులకు కళాశాల డైరెక్టర్లు యస్. శ్రీకాంత్ కుమార్ రెడ్డి, యమ్.రామమోహన్, దస్తగిరిలు శుభాకాంక్షలు తెలిపారు.

## మంచూరు సూర్యనారాయణ రెడ్డికి ఘన సన్మానం

**బద్వేల్ అర్బన్ జూలై 07 ప్రభాతవార్త :**



మంచూరు సూర్యనారాయణ రెడ్డి తెలుగుదేశం పార్టీలో వారు అందించిన సేవలు గుర్తుపెట్టుకుని వారికి కడప జిల్లా డీసీసీ బ్యాంక్ చైర్మన్‌గా రాష్ట్ర ప్రభుత్వం నియమించడం ఎంతో సంతోషకరమని సొల్లేటి వెంకటరమణ, (గట్టుపల్లె) బెంగళూరు అడ్వకేట్ పత్తి నాగేంద్రప్రసాద్, తుమ్మల పెంట సురేష్ బాబు, తులసి వెంకట శివ నారాయణ అన్నారు శనివారం కడప నగరంలో డిసిసి బ్యాంక్ చైర్మన్గా సూర్యనారాయణ రెడ్డి ప్రమాణ స్వీకారం మహోత్సవములో పాల్గొని పట్టు శాలువ గజమాలతో ఆయనను ఘనంగా సత్కరించారు అనంతరం వారు మాట్లాడుతూ అతి సాధారణ రైతు కుటుంబంలో జన్మించిన సూర్యనారాయణ రెడ్డి చిన్న వయసు నుండి కష్టపడి ఉన్నత స్థాయికి చేరుకొని అనేక రాష్ట్రాలలో కాంట్రాక్టు పనులు చేస్తూ రాష్ట్రస్థాయిలో అనేక మందిని దగ్గరికి తీసి కాంట్రాక్టర్ గా ఎంతో వారి ఎదుగుదలకు బాటలు వేసిన గొప్ప వ్యక్తి సూర్యనారాయణ రెడ్డి అని వారు అన్నారు, తెలుగుదేశం పార్టీలో అనేక సంవత్సరాలుగా ఉంటూ పార్టీకి వారు శక్తి వంచన లేకుండా కృషి చేసి జిల్లా స్థాయిలో ప్రజలు, నాయకులు ఆదర అభిమానాలు పొందిన సూర్యనారాయణ రెడ్డి భవిష్యత్తులో ఇటువంటి పదవులు మరెన్నో అలంకరించాలని కోరుకుంటూ అర్హులైన రైతు సోదరులందరూ కూడా డిసిసి బ్యాంక్ ద్వారా రుణాలు అందించే విధంగా వారి సేవలు ఎప్పటికీ ఉండాలని వారి సేవలను అభినందించారు.

## ఇంటర్ ఫలితాలలో డా.బి జె యస్ ఆర్, మరియు సుభాష్ గాయత్రి జూనియర్ కళాశాలల ప్రభంజనం

**బద్వేలు అర్బన్, జూన్ 7 ప్రభాతవార్త**



రాష్ట్రవ్యాప్తంగా శనివారం వెలువడిన ఇంటర్మీడియేట్ ఫలితాలలో బద్వేల్ పట్టణంలోని డా ..బి .జె.యస్.ఆర్. మరియు సుభాష్ గాయత్రి జూనియర్ కళాశాలల విద్యార్థులు తమ సత్తా చాటారు. ప్రథమ సంవత్సర ఫలితాలలో ఎంపీసీ విభాగంలో బి. గుణ వర్షిణి 465/470,పి. ధన్వి 464/470, బి. జాహ్నవి 464/470, కె. చంద్ర మోలిక 462/470, ఆర్. విజయ చంద్ర 460/470, కె.సాయి సాయి హరి చందన 459/470, పి.వి. కౌశిక 458/470, యం.శివ నందిని 458/470, యస్. యాస్మిన్ 456/470, యన్. లక్ష్మీ లాస్విత 454/470, యన్. వేద 453/470, యం. హర్షిత 450/470, ఇ.చిద్విష 450/470. మార్కులు సాధించి టౌన్ టాప్ గా నిలిచారు . అలాగే జూనియర్ ఇంటర్ బైపీసీ విభాగంలో షేక్ యాసిన్ 433 /440 టౌన్ ఫస్ట్ యస్. ఆయేషా 432/440 పి. రమ్య 427/440 షేక్ సమీనా 426/440 మార్కులు సాధించి టౌన్ టాపర్స్ గా నిలిచారు.ఇంకా 400 మార్కు లకు పైగా 59 మంది విద్యార్థులు మార్కులు సాధించినట్లు కళాశాల యాజమాన్యం తెలిపింది. ఈ మేరకు కరస్పాండెంట్ డాక్టర్ భూమిరెడ్డి జయసుబ్బారెడ్డి మాట్లాడుతూ ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం మరియు ద్వితీయ సంవత్సరంలలో ఎంపీసీ మరియు బైపీసీ గ్రూపులలో మా కళాశాల విద్యార్థులు టౌన్ ఫస్ట్ గా నిలవడం అభినందనీయం అని, మంచి క్రమశిక్షణ పట్టుదలతోనే మా విద్యార్థులు ఈ ఘనవిజయాన్ని సాధించారని కొనియాడారు, మా అధ్యాపకుల కృషి పట్టుదల వలనే ఇంత ఘనవి ఇంతటి ఘనవిజయం సాధ్యమైంది అని మాట్లాడుతూ కళాశాల విద్యార్థిని విద్యార్థులను మరియు అధ్యాపకులను అభినందించారు. ఇంతటి ఘన విజయం సాధించిన విద్యార్థిని విద్యార్థులను డా . బి.జె.యస్.ఆర్. జూనియర్ కాలేజ్ మరియు సుభాష్ గాయత్రి జూనియర్ కళాశాలల ప్రిన్సిపల్స్ మరియు అధ్యాపకులు అభినందించారు.

## మంచూరి సూర్యనారాయణరెడ్డికి పల్లె సుబ్బారెడ్డి ఘన సన్మానం



**బద్వేల్ అర్బన్ జూన్ 07 ప్రభాతవార్త :**

బద్వేల్ నియోజకవర్గానికి చెందిన ప్రముఖ టిడిపి సీనియర్ నాయకులు, కాంట్రాక్టర్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి శనివారం డిసిసి బ్యాంక్ జిల్లా చైర్మన్‌గా కడప, రాయచోటి రోడ్డు లోని మాధవి కన్వెన్షన్ సెంటర్లో పదవీ బాధ్యతలు చేపట్టడం సంతోష కరమని ప్రముఖ రైల్వే కాంట్రాక్టర్ పల్లె సుబ్బారెడ్డి అన్నారు, డిసిసి బ్యాంక్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టి ప్రమాణ స్వీకారం చేసిన మంచూరు సూర్యనారాయణ రెడ్డికి పట్టిశాల పూలమాలతో ఘనంగా సత్కరించిన రైల్వేకాంట్రాక్టర్ ఎల్ ఎస్ సుబ్బారెడ్డి మాట్లాడుతూ మంచూరు సూర్యనారాయణ రెడ్డి నియోజకవర్గ స్థాయిలో అనేకమంది ప్రజలకు సేవలు అందించి ఎంతోమంది కాంట్రాక్టర్లను ఉపాధి కల్పించే విధంగా వారు చేసిన సేవలు సంతోష్కరమన్నారు, శ్రమ జీవుల సమస్యలను దగ్గరగా తెలుసుకున్న వ్యక్తి సామాన్య రైతుల ఆకాంక్షలకు న్యాయం చేసే నేతగా ఆయన ఎదగలన్నారు, ప్రభుత్వ పథకాలను ప్రజలు దృష్టికి తీసుకుపోయేలా కృషి చేయాలన్నారు, రైతు కుటుంబంలో జన్మించిన సూర్యనారాయణ రెడ్డి డిసిసి బ్యాంక్ ద్వారా అర్హులైన రైతులందరికీ కూడా తగిన న్యాయం చేయాలని వారు కోరారు, మంచూరు సూర్యనారాయణ రెడ్డి ప్రమాణ స్వీకారానికి జిల్లాస్థాయి కాకుండా రాష్ట్రస్థాయిలో అభిమానులు వారి బంధుమిత్రులు నాయకులు విశేస సంఖ్యలో తరలివచ్చి వారిని ఆశీర్వదించడం సంతోషకరమన్నారు.

## డీసీసీ బ్యాంక్ చైర్మన్‌ను సన్మానించిన నాగార్జునరెడ్డి, వెంకటసుబ్బారెడ్డి





**బద్వేలు ,జూన్ 7, ప్రభాతవార్త :**

డీసీసీ బ్యాంక్ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేసిన మంచూరు సూర్యనారాయణరెడ్డిని అట్లూరు మండలం, మణ్యంవారిపల్లెకు చెందిన కాంట్రాక్టర్ కత్తెరపల్లె నాగార్జునరెడ్డి, బద్వేలు మున్సిపాలిటీలోని భాకరాపేటకు చెందిన గాజులపల్లి వెంకటసుబ్బారెడ్డిలు ఘనంగా సత్కరించారు. కడపలో జరిగిన ప్రమాణ స్వీకారం అనంతరం చైర్మన్ సూర్యనారాయణరెడ్డిని గజమాలతో సత్కరించారు. సూర్యనారాయణరెడ్డి పార్టీకోసం అహర్నిషలు శ్రమించారని, సేవా ధృక్పదంతో పలువురికి సేవ చేస్తుండడంతో అధిష్టానం గుర్తించి సముచిత స్థానం కల్పించడం జరిగిందడం అభినందనీయమన్నారు. సూర్యనారాయణరెడ్డి డీసీసీ బ్యాంక్ చైర్మన్‌గా రైతుల సమస్యలు పరిష్కరించి రైతుల పెన్నిధిగా నిలవాలని కోరుకుంటున్నామని నాగార్జునరెడ్డి, వెంకటసుబ్బారెడ్డిలు కోరుకుంటున్నారు. వారెన్నో సేవలు పొంది ప్రజా సేవలో నిమగ్నమై నిరంతరం పనిచేస్తూ కార్యకర్తలకు అండగా ఉండాలని కోరుకుంటామని వారు తెలిపారు.

## డీసీసీ బ్యాంక్ చైర్మన్‌ను సన్మానించిన ఎల్ఎస్పీ డ్యామ్ చైర్మన్



**బద్వేలు ,జూన్ 7, ప్రభాతవార్త :**

డీసీసీ బ్యాంక్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన మంచూరు సూర్యనారాయణరెడ్డి ప్రమాణ స్వీకారం కార్యక్రమానికి శనివారం ఎల్ఎస్పీ డ్యామ్ చైర్మన్ ఈగ వెంకటరమణారెడ్డి, కాంట్రాక్టర్ ఈగ సుబ్బారెడ్డిలు హాజరయ్యారు. ప్రమాణ స్వీకారం అనంతరం ఎల్ఎస్పీ డ్యామ్ చైర్మన్ సూర్యనారాయణరెడ్డిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీసీసీ బ్యాంక్ చైర్మన్‌గా అధిష్టానం గుర్తించి సముచిత స్థానం కల్పించడం అభినందనీయమని, ఆయన ఇలాగే పదవులు పొంది ఉన్నత స్థానాలకు వెళ్లాలని, అలాగే బ్యాంక్ చైర్మన్ గా రైతులకు ఉత్తమ సేవ ట్రందించి పార్టీకి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

## ప్లాస్టిక్ రహిత సమాజానికి
## ప్రతి ఒక్కరు పాటుపడాలి

**బద్వేలు, జూ న్ 7, ప్రభాతవార్త**

నేషనల్ రోడ్ సేఫ్టీ వారోత్సవాల్లో భాగంగా శనివారం జి ఈ రెన్యువల్ వైల్డ్ మిల్స్ వారి ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి, బద్వేల్ అర్బన్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ .రాజగోపాల్ గారు,ఎస్ఐ లు సత్యనారాయణ జయరామిరెడ్డి,మరియు సిబ్బంది, బద్వేల్ టౌన్ లోని ప్రజలతో కలిసి బద్వేల్ టౌన్ సిద్ధవటం రోడ్ లోని ఆర్టీసీ బస్టాండ్ నుండి నెల్లూరు రోడ్ ఇండియన్ ఆయిల్ పెట్రోల్ వారకు ప్లాస్టిక్ రహిత సమాజం కోసం ర్యాలీ చేయడమైనది. అలాగే ఇండియన్ ఆయిల్ పెట్రోల్ స్టార్ ఏర్పాటు చేసి కేజీ ప్లాస్టిక్ కేజీ బియ్యం ఇవ్వబడినది. అక్కడ బద్వేల్ పోలీస్ వారు మీటింగ్ ఏర్పాటు చేసి బద్వేలు టౌన్ ను ప్లాస్టిక్ రహిత సమాజంగా బద్వేలు తీర్చి దిద్దడానికి చేపట్టాల్సిన అంశాలపై ప్రజలకు వివరించారు

## ప్రజలకు చేరువైన వార్త దినపత్రిక

**బద్వేలు ,జూన్ 7, ప్రభాతవార్త :**

నిత్యం ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తూ ప్రజల గొంతుకగా నిలిచే వార్త తెలుగు జాతీయ దినపత్రిక ప్రజలకు మరింత చేరువైందనడంలో ఎలాంటి సందేహం లేదు. శనివారం కడపలో డీసీసీ బ్యాంక్ చైర్మన్‌గా మంచూరు సూర్యనారాయణరెడ్డిప్రమాణ స్వీకరాం చేసిన విషయం విధితమే. ఈ మేరకు ఈ కార్యక్రమానికి హాజరైన అనేక మంది వార్త దినపత్రికను చదువుతున్న దృశ్యం కనపడింది. దీనిని బట్టి ప్రజలలోకి వార్త దినపత్రిక ఏ మేరకు ప్రజలలోకి చొచ్చుకు వెళ్లిందనే విషయం అర్థమవుతుంది. ప్రజాపత్రికగా పేరొందిన వార్త పత్రిక నానాటికి తన సత్తా చాటుతూ ఈ దినపత్రికలో సమస్య ప్రచురితం కాగానే సంబంధిత అధికారులు సకాలంలో పరిష్కరిస్తారనే అంశాన్ని పలువురు పాఠకులు చర్చించుకోవడం కొసమెరుపు.



## పితృత్వ సెలవులు

ప్రసూతి అంటే అది స్త్రీల బాధ, పిల్లల సంరక్షణ తల్లి బాధ్యత అనుకునే రోజులు కావివి. మారిన పరిస్థితుల దృష్ట్యా డెలివరీ సమయానికి లేబర్ వార్డులో ఉండటమే కాదు.. పసివాళ్ల సంరక్షణా తమదే అంటున్నారు నేటితరం నాన్నలు. అందుకే వారికీ ప్రసూతి సెలవుల్ని ఇవ్వడానికి ప్రపంచ వ్యాప్తంగా కొన్ని దేశాలు ముందుకు వచ్చాయి. మనదేశంలో సెంట్రల్ సివిల్ సర్వీసెస్ రూల్స్-1972 40(సి) ప్రకారం బిడ్డ జన్మించిన లేదా దత్తత తీసుకున్న ఆరు నెలలలోపు 15 రోజుల పితృత్వ సెలవులు వినియోగించుకునేందుకు పురుషులు అర్హులు. సిక్కింలో మాత్రం ఒక నెల ఈ పెటర్నిటీ లీవ్స్‌ని మంజూరు చేస్తున్నారు. మైక్రోసాఫ్ట్ 6 వారాలు. టిసిఎస్ 15 రోజులు, విప్రో 8 వారాలు, జొమాటో 26 వారాలు, ఇన్ఫోసిస్ 5 రోజులూ ప్రసూతి సెలవుల్నిఇస్తున్నాయి. **2. ఇతర దేశాలల్లో ఎలా..** ✦. పెయిడ్ పేరెంట్ లీవ్‌ని ప్రపంచానికి పరిచయం చేసిన దేశం స్వీడన్. 1974 నుంచే ఈ చట్టం అమలులో ఉంది.కానీ 1995 నుంచి మాత్రమే తండ్రులు మూడు నెలలు సెలవు తీసుకోవడం తప్పనిసరి అయ్యింది. వీటినే 'డాడీ మంత్స్'గా పిలుస్తారు.

## అట్టహాసంగా డిసిసి బ్యాంక్ చైర్మన్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి ప్రమాణ స్వీకారం



**బద్వేల్ అర్బన్ జూన్ 07: ప్రభాత వార్త :**

ఉమ్మడి కడపజిల్లాలోని రైతుల సంక్షేమం. అభివృద్ధి.ధ్యేయంగా పని చేసి జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ ను రైతుల అభివృద్ధికి కృషి చేస్తానని నూతన డీసీసీబ్యాంక్ చైర్మన్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి. తెలిపారు. శనివారం కడప నగరంలోని మాధవి కన్వెన్షన్ సెంటర్లో ఏర్పాటుచేసిన సమావేశంలో అధికారికంగా పదవి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా వేలాదిగా పాల్గొన్న తెలుగుదేశం పార్టీ శ్రేణులు కూటమి నాయకులు హర్ష ద్వనాల మధ్య ప్రమాణ స్వీకారం అట్టహాసంగా జరిగింది. ఈ సందర్భంగా వారిని పలువురు అభిమానులు టిడిపి నాయకులు ఎమ్మెల్యేలు ఘనంగా సన్మానిస్తూ అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం డీసీసీ బ్యాంక్ చైర్మన్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ తనపై అతి పెద్ద బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంను అప్పగించిందని ఉమ్మడి జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేల ద్వారా అభివృద్ధి, ప్రభుత్వ ఫలాలు రైతులకు అందేలా కృషి చేస్తానని అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి జీవితాంతం రుణపడి ఉంటానని తెలిపారు.ఉమ్మడి జిల్లా నియోజకవర్గ ఎమ్మెల్యేలకు ఇన్చార్జిలకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి కడప జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు శ్రీనివాసరెడ్డి,ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్,ఎమ్మెల్యేలు మాధవి రెడ్డి, వరదరాజుల రెడ్డి, లింగారెడ్డి, అరవ శ్రీధర్, కూడా చైర్మన్ ముక్కారూపానందరెడ్డి, ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి, నియోజవర్గం ఇంచార్జ్ లు, రితిష్ రెడ్డి, భూపేష్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, బద్వేల్ నియోజకవర్గం యువ నాయకురాలు లీలా కైవల్యా రెడ్డి, డి సి సి బ్యాంక్ ఇంచార్జ్ సీఈవో రాజామణి. కడప జిల్లా టిడిపి అధికార ప్రతినిధి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పంచాయతీరాజ్ ఛాంబర్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కొత్తపు మునిరెడ్డి, ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ పరిటాల వెంకటసుబ్బయ్య జిల్లా వాణిజ్య విభాగం జనరల్ సెక్రటరీ ప్రసాద్, రాగిమాను ప్రతాప్ కుమార్ మస్తాన్ బాబు నాగార్జున జాంగిర్ భాష తో పాటు బ్యాంకు సిబ్బంది. స్థానిక ప్రజా ప్రతినిధులు. ప్రజలు భారీ ఎత్తున పాల్గొన్నారు.

**భారీ ఊరేగింపు టిడిపి నేతల కోలాహలం**

డీసీసీ బ్యాంక్ చైర్మన్ మంచూరు సూర్య నారాయణ రెడ్డి ప్రమాణ స్వీకారం అనంతరం కడప మార్గమధ్యంలో తన సొంత మండలం అట్లూరు మండలం నుండి క్రాస్ రోడ్డు నుండి తెలుగుదేశం పార్టీ నేతలు భారీగా ర్యాలీగా నియోజకవర్గంలోని 7 మండలాల ముఖ్య నేతలు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు బద్వేల్ పట్టణం వరకు ర్యాలీ నిర్వహించారు. ప్రత్యేక వాహనంపై డిసిసి బ్యాంక్ చైర్మన్ మంచూరు సూర్యనారాయణ రెడ్డిని ఊరేగింపుగా పూల వర్షం కురిపించారు.



## చాయ్ కోసం మసాలా ..

అన్నం తినడంలో ఆలస్యాలూ ఉండొచ్చు కానీ. చాయ్ విషయంలో అలాంటివే ఉండవు. పొద్దున్నే వేడివేడిగా కాస్త టీ తాగితే నిద్రమత్తు వదిలిపోయి చురుగ్గా ఉంటుంది. అందుకోసం 'చాయ్ మసాలా పొడి' ఉంటే చాలు. **ఎలా చేయాలంటారా..** కడాయిలో 50 గ్రాముల యాలకులు, 30 గ్రాముల మిరియాలు, 25 గ్రాముల లవంగాలు, రెండు అంగుళాల దాల్చినచెక్క, ఒక టేబుల్‌స్పూన్ సోంపులను తక్కువ సెగ మీద.. మంచి వాసన వచ్చేదాకా వేయించి, పళ్లెంలోకి తీయాలి. తర్వాత 40 గ్రాముల శొంఠిని కూడా అలాగే ఘుమాయించేదాకా వేగనిచ్చి, పళ్లెంలో వేయాలి. ఈసారి తులసి విత్తనాలు కంకులు 8, సంగం జాజికాయను వేయించాలి.

## సియాచిన్‌లో తొలి మహిళా ఆఫీసర్



మిలిటరీలో చేరాలనుకోవడమే ఓ సాహసమనుకుంటే.. ప్రపంచంలోనే అతి ఎత్తైన యుద్ధక్షేత్రం సియాచిన్‌లో విధులు నిర్వర్తించాలనుకోవడం ప్రాణాలను ఫణంగా పెట్టడమే! ఏ కాలమైనా-50 డిగ్రీల ఉష్ణోగ్రత, మంచు దుప్పటి కప్పుకొన్న కొండలు, ప్రమాదకరంగా విరిగిపడే కొండ చరియలు, శత్రుమూకలు ఎప్పుడు.. ఎటు నుంచి దాడి చేస్తాయో తెలియని పరిస్థితులు.. చేస్తే ఇలాంటి చోటే ఉద్యోగం చేయాలనుకుంది కెప్టెన్ సుప్రీత సిటీ. దేశ సేవకే తన జీవితాన్ని అంకితమివ్వాలని మూడేళ్ల క్రితం ఇండియన్ ఆర్మీలో చేరిన ఆమె. ఇటీవలే తన కలను నెరవేర్చుకుంది. ఆర్మీ ఎయిరడ్ డిఫెన్స్ దళం' నుంచి సియాచిన్ గ్లేసియర్‌లో విధులు నిర్వర్తించే అవకాశం దక్కించుకున్న చరిత్ర సృష్టించింది.

సుప్రీతది మైసూరు. బిజినెస్ అడ్మినిస్ట్రేషన్‌లో డిగ్రీ పూర్తిచేసిన ఆమె.. అక్కడి జెఎస్ఎస్ లా కాలేజీలో న్యాయవిద్యను అభ్యసించింది. చిన్నతనం నుంచి ఆమెకు దేశభక్తి ఎక్కువ. దీనికి తోడు ఆమె కుటుంబంలో చాలామంది ప్రభుత్వోద్యోగాల్లో స్థిరపడిన వారే! ఇదే తనను దేశసేవ వైపు వచ్చేలా ప్రేరేపించిందంటోందామె.

**ఎన్‌సిసిలో చేరి...** నాది ప్రభుత్వోద్యోగ నేపథ్యం ఉన్న కుటుంబం. నాన్న తిరుమలేశ్. సబ్ స్పెక్టర్‌గా పనిచేస్తున్నారు. అమ్మ నిర్మల గృహిణి. మా తాతముత్తాతలూ ప్రజా సేవ చేసిన వారే. ఇలా వీళ్లను చూస్తూ పెరిగిన నేనూ.. పబ్లిక్ సర్వీస్‌లోకి రావాలనుకున్నా. పైగా నాకు చిన్నతనం నుంచి దేశ సేవ చేయడమంటే ఇష్టం. ఈ మక్కువతోనే స్కూల్లో ఉన్నప్పుడే ఎన్‌సిసిలో చేరాను. ఎన్‌సిసి ఎయిర్ వింగ్-సి' సర్టిఫికెట్ కూడా పొందాను. ఎన్‌సిసి క్యాడెట్‌గా పలుమార్లు గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఢిల్లీలోని కర్తవ్య పథ్‌లో 'కర్ణాటక-గోవా' దళానికి నాయకత్వం వహించా. 2016లో ఆలిండియా వాయు సైనిక్ క్యాంపునకూ ప్రాతినిధ్యం వహించా..' అంటోన్న సుప్రీతకు ఆటలన్నా భలే ఇష్టమట! ఈ క్రమంలోనే స్కూల్లో ఉన్నప్పుడే పలు క్రీడల్లో పాల్గొని సతా చాటిందామె.

**కఠోర శిక్షణతో రాటుదేలి..!** దేశ సేవ చేయాలన్న మక్కువతో 2021లో ఇండియన్ ఆర్మీలో చేరిన సుప్రీత.. లెఫ్టినెంట్‌గా తొలి బాధ్యతలందుకుంది. అయితే అంతకంటే ముందు చెన్నైలోని ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీలో కఠోర శిక్షణ తీసుకుందామె. రక్షణ రంగంలోకి వచ్చాకా ఆమె దృష్టంతా సియాచిన్ యుద్ధక్షేత్రం పైనే ఉండేది. అందుకే ఎప్పటికైనా ఇక్కడ విధులు నిర్వర్తించాలని లక్ష్యంగా పెట్టుకున్న సుప్రీత.. ఇక్కడి ప్రతికూల పరిస్థితుల్ని తట్టుకునేలా తన శిక్షణను కొనసాగించింది. ఇలా ఆమె ధైర్యసాహసాలు, సంకల్పానికి తగినట్లే అనంత్‌నాగ్, జబల్‌పూర్, లేహ్.. వంటి వ్యూహాత్మక ప్రదేశాల్లో శిక్షణ నిమిత్తం ఆమెను పంపించారు. ఆర్మీ అధికారులు, ఓ వైపు వాళ్ల అంచనాల్ని నిజం చేస్తూనే.. మరోవైపు విధుల్లో తెగువను ప్రదర్శించేదామె. ఇదే ఆమెను సియాచిన్ యుద్ధక్షేత్రంలో ఆఫీసర్ నియమించేలా చేసింది. తద్వారా 'ఆర్మీ ఎయిర్ డిఫెన్స్ దళం' నుంచి సియాచిన్ గ్లేసియర్‌లో విధులు నిర్వర్తించే అవకాశం దక్కించుకున్న తొలి మహిళా ఆఫీసర్‌గా చరిత్ర సృష్టించింది సుప్రీత. ప్రపంచంలోనే అతి ఎత్తైన యుద్ధక్షేత్రంగా పిలిచే ఈ ప్రదేశంలో అత్యంత ప్రతికూల వాతావరణ పరిస్థితులుంటాయి. వీటికి తోడు శత్రు దాడులూ ఎక్కువే! ఇలాంటి ప్రదేశంలో



పనిచేసినప్పుడే మన సత్తా ఏంటో తెలుస్తుందంటోంది డేరింగ్ ఆఫీసర్. ఇక గతంలో ఆర్మీలోని 'ఫైర్ అండ్ ఫ్యూరీ' దళానికి చెందిన కెప్టెన్ శివ చౌహాన్.. ఆ దళం నుంచి సియాచిన్ గ్లేసియర్‌లో విధులు నిర్వర్తించే అవకాశం అందుకున్న తొలి మహిళా ఆఫీసర్‌గా నిలిచింది.

**తొలి జంటగా ఘనత...** సుప్రీత భర్త జెర్రీ బ్లెయిజ్ ఇండియన్ ఆర్మీలో మేజర్‌గా పనిచేస్తున్నారు. అయితే ఈ ఏడాది రిపబ్లిక్ డే సందర్భంగా కర్తవ్య పథ్‌లో నిర్వహించిన కవాతులో వేర్వేరు బృందాల్లో సభ్యులుగా ఈ భార్యాభర్తలిద్దరూ పాల్గొన్నారు. తద్వారా ఈ ఘనత సాధించిన తొలి ఆర్మీ కపుల్‌గా నిలిచారు. గతేడాది జూన్‌లో వివహం చేసుకున్న వీరిద్దరూ గతంలో ఎన్‌సిసికానయడెట్లుగానూ కర్తవ్య పథ్ కవాతులో పాల్గొ న్నారు. ఉద్యోగ రీత్యా వేర్వేరు ప్రదేశాల్లో విధులు నిర్వర్తిస్తోన్న మేము రిపబ్లిక్ పరేడ్‌లో భాగంగా కలిసి సాధన చేశాం.. మేమిద్దరం జీవితంలోనే కాదు.. దేశ సేవలోనూ భాగస్వాములవడం సంతోషంగా ఉంది.. అంటున్నారీ ఆర్మీ కపు.. అప్పట్లో ఈ జంట ఫొటోలు సోషల్ మీడియాలో వైరలయ్యాయి.

## భక్తిశ్రద్ధలతో బక్రీద్



రామాపురం జూన్ 07 ప్రభాతవార్త

మండలంలోని ముస్లిం మైనార్టీ సోదరులు బక్రీద్ (ఈద్‌ఉల్ ఆదా) పండగ వేడుకలను ఘనంగా చేరుకున్నారు గువ్వల చెరువు నీలకంఠరావుపేట ఉడుము వారిపల్లి రామాపురం హసనాపురం పకీరుపల్లి ఏకిలపల్లి ముస్లిం సోదరులు శనివారం ఈద్గాల వద్దకు వెళ్లి ప్రార్థనలు చేశారు. బక్రీద్ త్యాగానికి దాతృతానికి ప్రతీకగా అల్లా నేర్పడని మత గురువులు ముస్లిం సోదరులకు ప్రబోధించారు. అందుకు అనుగుణంగా బక్రీద్ పండుగను జరుపుకుంటామని సహనం ఓర్పు దాతృత్వానికి త్యాగానికి ప్రతిగా అల్లా తన శరీరంలోని మాంసాన్ని దానం చేశారని తెలిపారు ముస్లిం సోదరులు ఒకరికి ఒకరు బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకొని స్నేహితులకు బంధువులకు పేదలకు మాంసాన్ని పంచిపెట్టారు.

## మిగిలిన సీట్లకు దరఖాస్తులు

పెనగలూరు జూన్ 7 ప్రభాతవార్త



మండలంలో ఉన్నటువంటి ఏపీ మోడల్ స్కూల్ మరియు కాలేజీలో 2025, 26 విద్యా సంవత్సరానికి స్థానిక ఏపీ మోడల్ స్కూల్ మరియు జూనియర్ కాలేజీలో 7, 8 తరగతులు మరియు ఇంటర్మీడియట్ మొదటి ఏడాదిలో మిగిలిపోయిన సీట్లకు భర్తీ చేయుటకు పాఠశాల విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసినవి వీటి కోసం ఆన్ లైన్ సహా ఆఫ్ లైన్ దరఖాస్తులు స్వీకరించబడును ప్రవేశాలకు రిజిస్ట్రేషన్ ఫీజును చెల్లించేందుకు ఈ నెల ఐదు నుంచి 20వ తేదీ వరకు అవకాశం కల్పించడమైనది ఆఫ్లైన్ దరఖాస్తులు ఈ నెల 10 నుంచి 20వ తేదీ వరకు స్వీకరించబడును 7వ తరగతిలో 3 సీట్లు 8వ తరగతిలో 1సీటు మాత్రమే ఖాళీ కలవు అని పెనగులూరు ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ సహజ బ్లెస్సి తెలిపారు.

## ప్రసన్న వెంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు



సుండిపల్లి, మే 7, ప్రభాతవార్త :

మండల పరిధిలోని ముదుంపాడు గ్రామం ఆరోగ్య పురం నందు వెలసిన శ్రీ శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి వారికి ఆలయ అర్చకులు అమ్ము నాయక్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే స్వామివారికి ప్రత్యేక పూల అలంకరణ, అభిషేకము, తదుపరి స్వామివారికి నైవేద్యం సమర్పించడం జరిగింది వచ్చిన భక్తులు సోమవారం దర్శించుకున్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు ఇవ్వడం జరిగింది. డాక్టర్ గోపాల్ నాయక్ సుమలత సుదర్శన్ నాయక్ అంబికా సోనీ కుటుంబ సభ్యులు స్వామివారికి అభిషేక పాత్రను కానుకగా సమర్పించుకున్నారు.

## ఘనంగా బక్రీద్ పండుగ వేడుకలు



చిన్నమండెం జూన్ 7 ప్రబాతవార్త:

మండల పరిధిలోని ముస్లీం సోదరులు శనివారం బక్రీద్ పండుగ వేడుకలను ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా వారు ఉదయమే నూతన వస్త్రాలు ధరించి ఈద్గాల వద్దకు వెళ్లి సామూహికంగా ప్రార్థనలు చేశారు. అనంతరం ఒక్కరికి ఒక్కరు ఆలింగనం చేసుకుని ఈద్ ముబారక్ తెలుపుకొన్నారు. ప్రతిఒక్కరు వారి ఇండ్లలో తీపి పదార్థాలు, మాంసాహారం వండుకుని బందు మిత్రులతో కలసి విందులు ఏర్పాటు చేసుకున్నారు. దానాలు చేశారు.

## మండెం లక్ష్మీనరసింహ స్వామికి ప్రత్యేక పూజలు

చిన్నమండెం జూన్ 7 ప్రభాతవార్త:



మండలంలోని దేవగుడిపల్లి గ్రామం జల్లా వాండ్లపల్లి వద్ద మాండవ్య నది వద్దున వెలసిన మహిమాన్వితుడు మండెం లక్ష్మీ నరసింహాస్వామికి శనివారం ఉదయం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామికి అభిషేకం చేసి రంగురంగుల పుష్పాలతో అలంకరించారు. అర్చకులు స్వామికి నైవేద్యం సమర్పించి కొబ్బరికాయలు కొట్టి పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల వాసులే కాకుండా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

## భక్తి శ్రద్ధలతో ఈద్‌ఉల్‌అదా వేడుకలు

పీలేరు జూన్ 7 ప్రభాతవార్త:

పీలేరులో నియోజకవర్గంలోని పీలేరు కలికిరి కె.వి పల్లి, వాల్మీకిపురం కలకడ మండలాల్లోని ముస్లీంలు భక్తిశ్రద్ధలతో ఈద్ ఉల్ అదా (బక్రీద్) వండుగ వేడుకలను జరుపుకున్నారు. శనివారం ఉదయం పట్టణంలోని అన్ని మసీదుల నుంచి ముస్లీం సోదరులు స్థానిక జెండామాను దగ్గరకు చేరుకుని, అక్కడి నుంచి సామూహికంగా అల్లాను స్తుతిస్తూ మదనపల్లి మార్గంలోని ఈద్గా మైదానం చేరుకుని, పండుగ ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. అలాగే తదితర మండలాల్లోనే యుగాల వద్ద సామూహిక ప్రార్థనలు చేయించిన మత గురువు ముఫ్తీ అబ్దుల్లా మాట్లాడుతూ ముస్లీంలు పవిత్ర నెలవంక దర్శనం తరువాతి రోజు బక్రీద్ పండుగను అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపు కోవడం ఆనవాయితి. ముస్లీంలు తాము జరుపుకునే ముఖ్యమైన పండుగల్లో అతి ముఖ్యమైన పండుగల్లో ఈద్ ఉల్ అదా కూడా ఒకటని, పండుగ ప్రత్యేక ప్రార్థనల అనంతరం వారి శక్తి కొద్దీ కొందరు ముస్లీంలు పొట్టేళ్లను ఖుర్బానీగా ఇచ్చి ఆ మాంసాన్ని మూడు భాగాలు చేస్తారు. అందులో మొదటి భాగాన్ని తమ కోసం ఉంచుకుంటారు. రెండవ భాగాన్ని బంధువులకు, మూడవ భాగాన్ని పేదలకు కేటాయించి పంచి పెట్టడం మన ఆచారమన్నారు. ప్రత్యేక ప్రార్థనల అనంతరం ప్రతిఒక్కరూ ఒకరినొకరు ఆలింగనం చేసుకుంటూ పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా పీలేరు పట్టణ సిఐ యుగంధర్ పర్యవేక్షణలో ఎస్ఐ, సిబ్బంది ఈద్గాతోపాటు పట్టణంలో ఎక్కడా ఎలాంటి అవాంక్షనీయ సంఘటనలకు అవకాశం లేకుండా గట్టి బందోబస్తు నిర్వహించారు. అదేవిధంగా వాహనాల రాకపోకలను కూడా నియంత్రించి ట్రాఫిక్ సమస్యను పరిష్కరించారు.



ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లిం మత పెద్దలు తదితరులు

# భక్తి శ్రద్ధలతో బక్రీద్ వేడుకలు

రామసముద్రం జూన్ 7 ప్రభాతవార్త

మండల కేంద్రంలోని ముస్లిం సోదరులు బక్రీద్ పండుగను శనివారం ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని తిరుమలరెడ్డిపల్లె చెంబకూరు,నడింపల్లె గొల్లపల్లె,ఊలపాడు, కేసీ పల్లె, వనగాని పల్లె,గ్రామ ల్లోని ముస్లిం సోదరులు ఘనంగా బక్రీద్ పండుగను ఘనంగా నిర్వహించారు.బక్రీద్ ను పురస్కరించుకుని ఈద్గా వద్ద ముస్లిం సోదరులు ప్రార్థనల్లో పాల్గొన్నారు.దిగువపేట మసీద్ నుండి చెక్ పోస్ట్ మీదుగా ఈద్గా వరకు వెళ్లి ప్రార్థన లు చేశారు. అనంతరం మతపెద్దలు ముత్తవల్లి సిరాజ్ భాష మాట్లాడుతూ బక్రీద్ పండుగ త్యాగానికి ప్రతీక అని ముస్లింలు పేదలపట్ల జాతి, దయకలిగి ఉండటమే ఈపండుగ సందేశమన్నారు. హిందూ ముస్లిం సోదరలకు ముందుగా బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుతూ హిందూ ముస్లిం సోదర బావంతో మెలగాలని ఈ సంవత్సరం వర్షాలు బాగా పడి రైతులు సుఖశాంతులతో ఉండాలని ఆ అల్లాను వేడుకున్నట్లు తెలిపారు. మతగురువు ఉసామ్ ప్రత్యేక ప్రార్థన లు నిర్వహించారు,అనంతరం ముస్లిం సోదరులు పరస్పరం ఒకరినొకరు ఆలింగనం చేసుకోని బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పండుగ నేపథ్యంలో ఎలాంటి ఆటంకాలు జరగకుండా ఈద్గా వద్ద ఎస్సై జి. రవికుమార్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది లోకేష్, కిరణ్ కుమార్,కిరణ్ యాదవ్ విధులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మత గురువులు ముత్వల్లిసిరాజ్ బాషా, మహబూబ్ బాషా, ఆన్సర్ బాషా, మైనారిటీ నాయకులు సందూరి సర్దార్ బాషా, బాబా సాబ్ (తారక్ )పోలీస్ రియాజ్, టీచర్ షరీఫ్,చెంబకూరు షంషీ ర్,మున్వర్ సాబ్, మక్తియర్ ఉబేద్, ప్యారాజాన్, సయ్యద్, చాంద్ బాషా ముబారక్, బాబా, ఫ్రూట్స్ ఉస్మాన్, చాను షాబుద్దీన్, కరిముల్లా, మస్తాన్ వల్లి, వైస్ సర్పంచ్ మస్తాన్, హైదర్ సాబ్, జబీఉల్లా ఇమ్రాన్, సమీ, బాబా, మాలిక్, సుభాన్ మస్తాన్,ముబారక్ సలీం జబీ, రఫీ, వల్లి, జావిద్, హమీద్, రహంతుల్లా, జావెద్,ఫర్ట్ లైజర్ రియాజ్, మతపెద్దలు మైనారిటీ సోదరలు తదితరులు పాల్గొన్నారు. తిరుమలరెడ్డిపల్లె ఆన్సర్ బాషా, ముత్వల్లి సర్దార్ బాషా మాట్లాడుతూ అల్లా మీకు శాంతి, శ్రేయస్సు ను ప్రసాదించాలని అందరి జీవితాల్లో వెలుగులు నింపాలని అందరూ సుఖ సంతోషాలతో జీవించాలని పాడి పంటలు బాగా పండాలని రైతులు, వ్యాపారస్థులు అల్లా దయ, దేవుడు దయ ఉండాలన్నారు.



## భక్తిశ్రద్ధలతో ఘనంగా బక్రీద్ వేడుకలు



ముద్దనూరు, జూన్ 07, ప్రభాతవార్త:

ముస్లిం సోదరులు పూర్వకాలం నుంచి ఆనవాయితీగా వస్తున్న బక్రీద్ వేడుకలను ఎంతో భక్తిశ్రద్ధలతో శనివారం ఘనంగా నిర్వహించారు. మండల పరిధిలోని ఈద్గా దర్గాలను లైటింగ్ తో ముస్తాబు చేసి ఒకరిని ఒకరు ఆప్యాయంగా అలింగణం చేసుకొని ఈద్ ముబారక్ ఒకరికి ఒకరు చెప్పుకున్నారు. పట్టణంలోని తాడిపత్రి హైవే పక్కన ఉన్న ఈద్గా దర్గాలో చిన్నపిల్లలు, ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో నమాజ్ ప్రక్రియను చేపట్టారు. పీఠాధిపతులు బక్రీద్ వేడుక యొక్క ఆవశ్యకతను వివరించారు. పేద ప్రజలకు దాన సహాయ సహకారాలు అందించడమే బక్రీద్ పండుగ యొక్క ముఖ్య ఉద్దేశం అని ఈ సందర్భంగా మత గురువుల పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ముస్లిం సోదరులు పీఠాధిపతులు మతగురువులు పాల్గొన్నారు.

## మావోయిస్టుల మృతదేహాలను బంధువులకు అప్పగించాలి

### రౌండ్‌టేబుల్ సమావేశంలో నాయకులు డిమాండ్




సమావేశంలో మాట్లాడుతున్న దృశ్యం

మదనపల్లె, జూన్ 7 ప్రభాతవార్త :

కాల్పుల్లో చనిపోయిన మావోయిస్టుల శవాలను బంధువులకు అప్పగించాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శనివారం ఎస్టీయూ కార్యాలయంలో ప్రజాసంఘాల నాయకులు రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వీసికే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిటిఎం శివప్రసాద్, మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు యమలా సుదర్శనం, సిపిఐ జిల్లా కార్యదర్శి పి ఎల్.నరసింహులు, బహుజన సేన రాష్ట్ర అధ్యక్షులు శ్రీచందు, శాంతి సంఘీభావం రాష్ట్ర ప్రచారకార్యదర్శి జివి.శివకుమార్, ఏపిసిఎల్‌సి నాయకులు నాగేశ్వర్‌రావు, న్యాయవాధి సోమశేఖర్‌లు మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం శత్రుదేశాలతో నరహంతకులైన ఉగ్రవాదులతో చర్చలు జరుపుతోందని, దేశంలో మౌలిక సమస్యలు పరిష్కారం చేయాలని, పేదరిక నిర్మూళన దోపిడికి వ్యతిరేకంగా పోరాడుతున్న మావోయిస్టులపై ఆపరేషన్ జగూర్ ప్రారంభించడం సరైంది కాదన్నారు. శాంతి చర్చల కోసం నాలుగు లేఖలు రాసిన కేంద్ర ప్రభుత్వం చర్చలకు నిరాకరించిందన్నారు. ఈనెల 12న సబ్‌కలెక్టర్ కార్యాలయం నందు ఆపరేషన్ జగూర్‌ను ఆపాలని ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరసనకార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈకార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు క్రిష్ణప్ప, మురళి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాస్వామ్య రక్షణ కోసం పనిచేస్తాం

పీలేరు జూన్ 7 ప్రభాతవార్త :



ప్రజా సమస్యల పరిష్కారం కోసం బాదితులతో పాటు పోలీసు స్టేషన్‌కు వెళ్లిన సీపీఐ పీలేరు నియోజకవర్గ కార్యదర్శి టి.ఎల్ వెంకటేష్‌ను బాదితుల ముందే పీలేరు పోలీసుస్టేషన్‌లో ఉన్నతాధికారుల మెప్పు కోసం సిఐ అవమా నించిన ఘటనను తీవ్రంగా ఖండిస్తూమని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు యం.సాంబశివ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు ప్రజాస్వామ్యంలో ప్ర జల సమస్యలు చెప్పుకునే హక్కు ప్రతి ఒక్కరికి ఉంది. వాటిని వినడానికి, పరిష్కరించడానికి ఉన్న పోలీసు వ్యవస్థే ప్రజాస్వామ్యానికి రక్షకులుగా ఉండాలి. కానీ, విద్యావంతుడై, ప్రజాసమస్యలపై పోరాటం చేస్తున్న సీపీఐ నాయకుడిని అవమానించడం, మాటలు తప్పి మాట్లాడడం, సిఐ అధికారాన్ని దుర్వినియోగించడం తీవ్రంగా ఖండిస్తామని తెలిపారు. ఈ ఘటనపై మేము జిల్లా ఎస్పీ గారిని కలిసి, విచారణ జరిపించి, సంబంధిత సీఐ పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాం. అలాగే, పోలీసు శాఖలో ప్రజా సమస్యల పట్ల నైతిక బాధ్యత, గౌరవం పెంచేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నామని ఈ విషయం మీద మా పార్టీ రాష్ట్ర నాయకత్వానికి, హక్కుల సంఘాలకు, ప్రజాసంఘాలకు తెలియజేస్తామని. పోలీసు వ్యవస్థ పట్ల ప్రజల్లో నమ్మకం తక్కువ అవ్వకూడదు. ప్రజాస్వామ్యం రక్షణ కోసం కమ్యూనిస్టులు పనిచేస్తున్నారని, పజా సమస్యల పరిష్కారం కోసం సీపీఐ తరపున పోరాటం సాగిస్తున్నామన్నారు.

## ఏపీ సేవ పోర్టల్ సేవలు నిలుపుదల

పులివెందుల,జూన్7,ప్రభాత వార్త:

నాలుగు రోజులపాటు ఏపీ పోర్టల్ సేవలు నిలుపుదల అవుతున్నట్లు మున్సిపల్ కమిషనర్ రాముడు ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామ/వార్డు సచివాలయ శాఖ నిర్వహిస్తున్న ఏపీ సేవ పోర్టల్ ను మైక్రోసాఫ్ట్ నుండి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డేటా సెంటర్ కి తరలింపు (మైగ్రేషన్) చేపడుతోందని. ఈ పనుల నిర్వహణ నిమిత్తం 07.06.2025 (శనివారం) ఉదయం నుండి 10.06.2025 (మంగళవారం) రాత్రి వరకు ఏపీ సేవ పోర్టల్ ద్వారా అందించు సేవలను నిలుపుదల చేయటమైనదని తెలిపారు. కావున ఈ క్రింది సేవలు 1.ఆదాయ ధ్రువీకరణ పత్రం 2. సమగ్ర ధ్రువీకరణ పత్రం 3.భూమి మ్యూటేషన్లు 4.రేషన్/ రైస్ కార్డులు 5.ఇల్లు స్థల పట్టాలు 6. వృద్ధాప్య ధృవీకరణ పత్రాలు 7.వివాహ ధృవీకరణ పత్రాలు 8.రెవెన్యూ వాటర్ టాక్స్ 9.పట్టణ పరిపాలన సంబంధిత సేవలు 10.మత్స్యశాఖ సేవలు అందుబాటులో ఉండవని మిగిలిన ఇతర ప్రభుత్వ సేవలు మీసేవా కేంద్రాలలో అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఈ అంతరాయనికి చింతిస్తూ, ఈ విషయములో ప్రజలందరూ ప్రభుత్వానికి సహకరించవలసినదిగా ఆయన కోరారు. అలాగే ప్రభుత్వ ఆదేశముల మేరకు ప్రభుత్వ వైద్యుల సమక్షములో 75 సం. లు పైబడిన వారికి మున్సిపల్ కార్యాలయము నందు తేది. 08 న ఉదయం 7.00 గంటలకు యోగా గురువులు చేత ఉచిత యోగా శిక్షణా కార్యక్రమము నిర్వహించబడునని. కావున ఆసక్తి గల వారు సదరు యోగా శిక్షణా కార్యక్రమము నందు పాల్గొనవలసినదిగా ఆయన పేర్కొన్నారు.

## స్మశాన వాటికకు వెళ్లే రహదారి సమస్య పరిష్కారం



సిద్ధవటం, జూన్ 7: ప్రభాతవార్త

టక్కోలు బీసీ కాలనీ నుండి స్మశాన వాటికకు వెళ్లే రహదారి పై దీర్ఘకాలంగా కొనసాగుతున్న సమస్యకు పరిష్కారం దొరికింది. పలు సంవత్సరాలుగా రహదారి నిర్మాణానికి అడ్డుగా ఉన్న విద్యుత్ స్తంభాలను (కరెంట్ పోల్స్) పార్లమెంట్ కార్యదర్శి శ్రీ అండ్లూరి నాగముని రెడ్డి ఆధ్వర్యంలో తొలగించి పక్కకు మార్చడమైనది.ఈ పనిని కాంట్రాక్టర్ రమణ చేపట్టగా, విద్యుత్ స్తంభాలను పక్కకు షిఫ్ట్ చేసి రహదారి నిర్మాణానికి మార్గం సుగమం చేశారు. ఈ సందర్భంగా బీసీ కాలనీ వాసులు ఆనందం వ్యక్తం చేశారు. గ్రామ అభివృద్ధికి టిడిపి ప్రభుత్వం లో జరుగుతోంది అని వారు అన్నారుఈ కార్యక్రమంలో టీడీపీ కార్యకర్తలు, గ్రామస్థులు, పెద్దలు పాల్గొన్నారు. ప్రజల సమస్యల పరిష్కారంలో ఆలస్యం లేకుండా పని చేస్తున్న నాగముని రెడ్డి ప్రజలు కొనియాడారు. గ్రామ అభివృద్ధే లక్ష్యంగా ప్రతి సమస్యను పరిష్కరించేందుకు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని, త్వరలోనే రహదారి పనులు కూడా మొదలు పెడతాము అని తెలిపారు.

## శేఖర్ స్వీట్స్ యజమాని ముత్తుస్వామి మృతి

మదనపల్లె, జూన్ 7 ప్రభాతవార్త :



మదనపల్లె పట్టణంలో ప్రముఖ శేఖర్ స్వీట్ షాపు యజమాని పి.ముత్తుస్వామి(82) శనివారం మృతి చెందారు. గత కొద్ది రోజులుగా అనారోగ్యానికి గురికావడంతో బెంగుళూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స అందించారు. శనివారం ఉదయం చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచారు. ఆదివారం మదనపల్లె నుంచి వైకుంఠరథంలో నిమ్మనపల్లె మండలం గారబురుజు వరకు తీసుకెళ్ళి అక్కడ ఉన్న తన వ్యవసాయ క్షేత్రంలో ముత్తుస్వామి కుమారుడు బాల సుబ్రమణ్యం ఆధ్వర్యంలో అంత్యక్రియలు నిర్వహించనున్నారు. ముత్తుస్వామి మృతికి ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దేశాయ్ తిప్పారెడ్డి, మాజీ ఎంఎల్‌సి బి.నరేష్ కుమార్‌రెడ్డి, మదనపల్లె నియోజకవర్గ వైఎస్ఆర్ సిపి సమన్వయకర్త నిస్సార్ అహ్మద్, తెలుగుయువత రాష్ట్ర అధ్యక్షులు శ్రీరామ్ చినబనాబు, జనసేన పార్టీ రాయలసీమ కోకన్వీనర్ గంగారపు రాందాస్‌చౌదరి, ప్రముఖ వస్త్ర దుకాణం యజమాని దిలీప్‌కుమార్, ఎన్ఆర్ఐ ములబాగిల్, మాదవరెడ్డి, ప్రముఖ వ్యాపారులు ముత్తుస్వామి మృతదేహం వద్ద పూలమాలవేసి నివాళులర్పించారు. తొలుత తన కుటుంబ జీవనోపాది కోసం చిన్న వ్యాపారిగా మారారు. చిన్న చిన్న వ్యాపారం చేస్తూనే అంచెలంచెలుగా ఎదిగారు. తరువాత శేఖర్‌స్వీట్స్ షాపును ప్రారంభించారు. శేఖర్ స్వీట్ షాపులో పట్టణ ప్రజలు, వినియోగదారులకు కావాల్సిన నాణ్యమైన, రుచికరమైన పలు రకాల మిక్చర్, బిస్కెట్స్, బర్త్‌డే కేకులు, కూల్‌డ్రింక్స్ అందుబాటులో ఉంచారు. ఎంతో రుచికరంగా ఉండడంతో సిటిఎం రోడ్డులోని శేఖర్ స్వీట్స్ దుకాణం ఎంతో ప్రసిద్ది చెందింది. ఆ తరువాత ఎన్‌టిఆర్ సర్కిల్‌లో రెండవ శేఖర్‌స్వీట్స్ దుకాణాన్ని ప్రారంభించారు. రెండు దుకాణాలు ప్రసిద్ది చెంది వినియోగదారులను ఆకట్టుకున్నాయి.

## జిల్లా ఎస్పి ఆకస్మిక తనిఖీ

నిమ్మనపల్లె, జూన్ 7 ప్రభాతవార్త :

అన్నమయ్య జిల్లా ఎస్పి విద్యాసాగర్‌నాయుడు శనివారం నిమ్మనపల్లె మండలంలోని పోలీస్‌స్టేషన్‌ను అకస్మికంగా తనిఖీ చేశారు. అదే విధంగా మండలంలోని సైదాపేటా అనే గ్రామానికి వెళ్ళి పశువుల జంతువద జరుగుతోందని అగంతకులు చేసిన ఫోన్‌కాల్‌కు స్పందించి గ్రామాన్ని సందర్శించి వివరాలు తెలుసుకొన్నారు. వీరి వెంట నిమ్మనపల్లె ఎస్ఐ తిప్పేస్వామి పాల్గొన్నారు.

## వాహనాలను తనిఖీ చేసిన సీఐ బాబు



సిద్ధవటం జూన్ 7 ప్రభాతవార్త :

సిద్ధవటం గ్రామ శివారులో మూలపల్లె క్రాస్ వద్ద శనివారం ఒంటిమిట్ట సర్కిల్ ఇన్స్పెక్టర్ బాబు విస్తృతంగా వాహనాలు తనిఖీచేబట్టి పత్రాలు లేని వాహనదారులకు జరిమానా విధించారు.ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ విస్తృత వాహనాలు తనిఖీ చేపట్టగా కొంతమంది ద్విచక్ర వాహనదారుల పత్రాలు, లైసెన్స్ లేని వారికి ఫైన్ విధించామన్నారు.హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని ద్విచక్ర వాహనదాలకు సూచించారు.పత్రాలు లేని 10 ద్విచక్ర వాహనాలను గుర్తించి ఒక్కొక్క వాహనానికి రూ.185 చొప్పున జరిమానా విధించామన్నారు. వాహనాలు నడిపేటప్పుడు ప్రతి ఒక్కరూ హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని సిఐ సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## త్యాగం, సహనం, మానవత్వానికి ప్రతీకగా బక్రీద్

సిద్దవటం జూన్ 7 ప్రభాతవార్త :



త్యాగం, సహనం, మానవత్వానికి ప్రతీకగా బక్రీద్ (ఈద్‌అల్‌అధా) పండుగను నిర్వహించుకోవాలని సిద్దవటం ఇమామ్ సయ్యద్ పీర్ బాషా ఖాద్రి పిలుపునిచ్చారు."దైవ ప్రవక్త ఇబ్రహీం మహోన్నత త్యాగాన్ని స్మరించుకుంటూ భక్తి భావం, విశ్వాసం, కరుణ, ఐక్యతకు సంకేతమైన ఈ బక్రీద్ పండుగను భక్తి శ్రద్ధలతో నిర్వహించుకుంటున్న ప్రతి ఒక్కరికీ ఆ అల్లాహ్ ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ఆశిస్తున్నామన్నారు.

## వెబ్ కౌన్సిలింగ్ వద్దు మాన్యువల్ కౌన్సిలింగ్ ముద్దు



పులివెందుల,జూన్7, ప్రభాతవార్త:

ఉపాధ్యాయుల బదిలీలు వెబ్ వద్దు మ్యానువల్ కౌన్సిలింగ్ ముద్దు అని ఆ దిశగా అధికారులు మ్యానువల్ కౌన్సిలింగ్ నిర్వహించాలని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘాల పిలుపు మేరకు శనివారం స్థానిక పులివెందుల మండల విద్యాశాఖ అధికారి కార్యాలయం లో అధికారులు నిర్వహించతలసిన వెబ్ కౌన్సిలింగ్ హెల్ప్ లైన్ సెంటర్ దగ్గర ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక పులివెందుల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. వెబ్ కౌన్సిలింగ్ లో ఉపాధ్యాయులు ఎక్కువ ఆప్షన్లు నమోదు చేసుకోవాల్సి వస్తుంది. ఇందులో నష్టపోయేటువంటి అవకాశం ఉంది. కావున కచ్చితంగా ముందుగా ప్రభుత్వం ఉపాధ్యాయ సంఘాలకు మాట ఇచ్చిన విధంగా మాన్యువల్ కౌన్సిలింగ్ చేపట్టాలి అని విద్యాశాఖ అధికారులకు వినతి పత్రం ఇవ్వండం జరిగింది. ఇందుకు ప్రభుత్వం స్పందించకపోతే ఆదివారం ఉదయం డీఈఓ కార్యాలయాల ముట్టడి కార్యక్రమం చేపట్టడం జరుగుతుందని పెద్ద ఎత్తున ఉపాధ్యాయ మిత్రులు పాల్గొని ఆ కార్యక్రమాన్ని జయప్రదం చేయవలసిందిగా పిలుపునిచ్చారు.

## భక్తిశ్రద్ధలతో బక్రీద్ పండుగ వేడుకలు



మసీదు వద్ద ప్రార్థన చేస్తున్న ముస్లిమ్ సోదరులు

పులివెందుల,జూన్ 7,ప్రభాత వార్త:

భక్తిశ్రద్ధలతో బక్రీదు పర్వదినాన్ని ఘనంగా ముస్లింలు జరుపుకున్నారు. శనివారం బక్రీదు పండుగ సందర్భంగా పట్టణంలోని స్థానిక శ్రీరామ థియేటర్ వద్ద, పార్నపల్లి రోడ్డు వద్ద ఉన్న ఈద్గాలలో ఉదయం ముస్లిం లు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి ఒకరినొకరు ఆలింగనం చేసుకుని బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా ముస్లిం మత పెద్దలు మాట్లాడుతూ బక్రీద్ అంటే బకర్ ఈద్ అని అర్థమని బకర్ అంటే జంతువు అని ఈద్ అంటే పండుగని అర్థాలు ఉన్నాయని తెలిపారు. జంతువును ఖుర్బానీ (దానం) ఇచ్చే పండుగ కాబట్టి దీనిని ఈదుల్ ఖుర్బానీ కూడా అంటారని అన్నారు. త్యాగనిరతితో పాటు మనోవాంఛ, స్వార్థం, అసూయ, రాగద్వేషాలను కూడా విడిచిపెట్టి మానవతను వెదజల్లాలన్నదే బక్రీద్ పండుగ యొక్క పరమార్థం అని తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా రూరల్ సీఐ వెంకటరమణ ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు.

## త్యాగానికి ఐక్యతకు ప్రతీక బక్రీద్



గాలివీడు, జూన్ 7(ప్రభాతవార్త):

త్యాగాలకు ఐక్యతకు ప్రతీక బక్రీద్ పండుగ అని ముస్లిం సోదరులు కొనియాడారు. శనివారం మండల వ్యాప్తంగా బక్రీద్ పండుగను ముస్లిం సోదరులు ఘనంగా జరుపుకున్నారు. ఉదయమే మసీదుకు వెళ్లి ప్రార్థనలు చేసిన అనంతరం ఈద్గా దగ్గరికి వెళ్లి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించినారు. అనంతరం ప్రతి ఒక్కరూ ఇతరులకు దానాలను అందజేశారు. దైవ ప్రవక్త ఇబ్రహీం త్యాగాన్ని స్మరించుకుంటూ త్యాగానికి విశ్వాసానికి కరుణ ఐక్యతకు ప్రత్యేకంగా నిలిచే బక్రీద్ పండుగను ప్రతి ఒక్కరూ సంతోషంగా జరుపుకున్నారు.

## వ్యక్తి ఆత్మహత్య

గాలివీడు, జూన్ 7(ప్రభాతవార్త):



గోరాన్‌చెరువు గ్రామానికి చెందిన నచ్చుకూరి లక్ష్మయ్య(59) అనారోగ్యం కారణంగా విషద్రావం సేవించి మృత్యువాత పడిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్ఐ రామకృష్ణ కథనం మేరకు.. గోరాన్‌చెరువు గ్రామం బండివాండ్లపల్లె ఎస్టీ కాలనీకి చెందిన నచ్చుకూరి పాపన్న కుమారుడు మృతుడు లక్ష్మయ్యకు పదే పదే మూర్ఛ వ్యాధి వస్తుండటంతో మనస్తాపం చెందేవాడు. దీంతో జీవితంపై విరక్తి చెందిన మృతుడు జూన్ 1వ తేదీన పెన్షన్ డబ్బులు తీసుకుని సాయంకాలం 6 గంటల సమయంలో పొలం దగ్గరకు వెళ్లి వస్తానని చెప్పి వెళ్లాడు. ఎంత సేపటికీ తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు వెళ్లి చూడగా పొలం వద్ద స్పృహ తప్పిపోయి పడి ఉండటంతో పాటు నోటి నుండి బురుగు రావడం, పక్కనే ఖాళీగా ఉన్న వాస్మైల్ బాటిల్‌ను గుర్తించారు. వెంటనే 108 వాహనంలో రాయచోటి ప్రభుత్వాసుపత్రికి తరలించగా, మెరుగైన వైద్యం కోసం కడప రిమ్స్‌కు తరలించారు. ఈ క్రమంలోనే చికిత్స పొందుతూ లక్ష్మయ్య శనివారం మృతిచెందారు. మృతుడు కుమారుడు నాగరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. ఇదిలా ఉండగా మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

## ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపిన బీసీ నాయకులు

పీలేరు జూన్ 7 ప్రభాతవార్త :

పీలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా బీసీలకు ఇవ్వడం హర్షనీయమని తెలుగుదేశం పార్టీ చిత్తూరు పార్లమెంట్ ఈడిగ బిసి సాధికార సమితి అధ్యక్షులు బుస్సా నాగరాజ గౌడ్ అన్నారు. శనివారం ఆయనతోపాటు చిత్తూరు జిల్లా గౌడ సంఘం ఉపాధ్యక్షులు యాలపల్లి దీన్ దయాళ్, జిల్లా గౌడ సంఘం యువసేన ప్రధాన కార్యదర్శి వేపాకుల మురళిగౌడ్, పూతలపట్టు గౌడ సంఘం నాయకులు తుమ్మల నాగరాజ, మార్కెట్ కమిటీ కార్యాలయంలో నూతనంగా మార్కెట్ యార్డ్ చైర్మన్ గా పురం రామ్మూర్తి కు రావడంతో వారు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వర్గీయ నందమూరి తారక రామారావు తెలుగుదేశం పార్టీ స్థాపించి రాజకీయాలకు ఆమడ దూరంలో నిలిచిన బీసీలకు పిలిచి అవకాశాలు ఇచ్చారని, అదేవిధంగా జనాభాలో అత్యధికంగా మెజార్టీ లో ఉన్న బీసీలకు పక్షపాతిగా తెలుగుదేశం పార్టీ నిలిచిందని తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్రవ్యాప్తంగా బీసీలకు పెద్దపీట వేయడం హర్షనీయమన్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోనే ప్రధాన పట్టణంగా నిలిచిన పీలేరు మార్కెట్ యార్డ్ చైర్మన్ గా పురం రామ్మూర్తికి ఇవ్వడం తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి పీలేరు నియోజకవర్గ శాసనసభ్యులు నల్లారి కిషోర్ కుమార్ రెడ్డికు వారు కృతజ్ఞతలు తెలిపారు.



పురం రామ్మూర్తిని సన్మానిస్తున్న బీసీ నాయకులు

# దివ్య త్యాగాలకు ప్రతీక బక్రీద్



ప్రార్థనల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

**మదనపల్లె, జూన్ 7 ప్రభాతవార్త :**
దివ్య త్యాగాలకు ప్రతీకగా నిలిచే పండగ బక్రీద్ అని మత గురువు మౌళానా షుయోబ్ సాహబ్ అన్నారు. శనివారం బక్రీద్ పండగ సందర్భంగా బెంగుళూరు రోడ్డులోని ఈద్గా మైదానంలో వేలాదిమంది ముస్లిం సోదరులు సామూహిక ప్రార్థనలు జరుపుకొన్నారు. ముస్లిం ముఖ్య పర్వదినమైన ఈద్–ఉల్–హాజ్‌ను ముస్లిం సోదరులు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. ఈ సందర్భంగా మత గురువు దార్మికోపన్యాసం చేస్తూ ప్రవక హాజరత్ ఇబ్రహీం తనకు 80సంవత్సరాల మొదటి వయసులో జన్మించిన ఏకైక కుమారుడు హాజరత్ ఇస్మాయిల్‌ను దైవమార్గంలో బలి ఇవ్వడానికి సిద్ధపడ్డ వైనాన్ని తెలియజేశారు. ఆయనను ఆదర్శంగా తీసుకొని స్వార్థాన్ని వీడి నిస్వార్థ సమాజానికి కృషి చేయాలన్నారు. అంతకుముందు ముస్లిం సోదరులు జామియా మసీదు వద్దకు చేరుకొని అక్కడ నుంచి తక్బీర్‌ను పటిస్తూ ఈద్గా మైదానానికి చేరుకొన్నారు. విశ్వశాంతికోసం ప్రార్థనలు చేశారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకొని శుభాకాంక్షలు జరుపుకొన్నారు. ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ముస్లిం సోదరులను ఆలింగనం చేసుకొని శుభాకాంక్షలు తెలిపారు. ఆయనతో పాటు టిడిపి రాష్ట్ర మైనార్టీ నాయకులు ఎస్.ఎ.మస్తాన్, హాజ్‌కమిటీ సభ్యులు పఠాన్‌ఖాదర్‌ఖాన్, మహమ్మద్‌ఖాన్, షోయాబ్‌షీనా, షంషీర్ ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. వైకాపా నియోజకవర్గ కన్వీనర్ నిస్సార్‌అహ్మద్ ఈద్ మైదానంలో ముస్లిం సోదరులను ఆలింగనం చేసుకొని శుభాకాంక్షలు తెలిపారు. బసినికొండలోని బిలాల్ మసీదులో జరిగిన ఈద్ ప్రార్థనల్లో మున్సిపల్ వైస్‌ఛైర్మెన్ జింకా చలపతి పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

## భక్తి శ్రద్ధలతో ఘనంగా బక్రీద్ వేడుకలు



**లక్కిరెడ్డిపల్లి, జూన్ 09; ప్రభాతవార్త**
మండలంలోని లక్కి రెడ్డి పల్లి, కోనంపేట, పందిళ్లపల్లి ,దప్పెపల్లిలో బక్రీద్ వేడుకలను ముస్లింలు శనివారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక రెడ్డివారిపల్లి రోడ్డులోని కానెకుంట సమీప ఈద్గాలో సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. అంతకుముందు పట్టణంలోని ముస్లింలు ర్యాలీగా ఈద్గాకు చేరుకున్నారు. అనంతరం ముస్లిం మత మూలింటి షేక్ మక్తర్ అహ్మద్ మాట్లాడుతూ ప్రవక్త హజరత్ ఇబ్రహీం త్యాగం ఆదర్శనీయమని పేర్కొన్నారు ఇస్లాం సూచించిన సన్మార్గంలో నడిచి పేదలకు దానం ధర్మాలు చేయాలని, పేదరికం లేని సమాజ నిర్మాణం కోసం కృషి చేయాలన్నారు ఈద్గాలో ముస్లిం సోదరులు సామూహిక ప్రార్థనలో అలింగనం చేస్తూ అందరకీ ఈద్ ముబారక్ చెప్పారు కార్యక్ర మంలో మైనార్టీ నాయకులు రాజంపేట తెదేపా డాక్టర్ల ప్రధాన కార్యదర్శి షఫీ నాయక్మ, మక్తర్, మసూద్, కాజా, జాకీర్, చాంద్ బాషా, ముస్లిం సోదరులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా గంగమ్మ జాతర

**చాపాడు. జూన్ 7. ప్రభాతవార్త..**



మండలంలోని చియ్యపాడు గ్రామం నందు గ్రామ పెద్దల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గంగ జాతర శుక్రవారం నుండి ప్రారంభమై శనివారం రెండవ రోజు అత్యంత వైభవంగా పూజా కార్యక్రమాలు చేపట్టారు. ఉదయం అమ్మవారికి ప్రత్యేక అలంకరణతో పాటు, పుట్ట బంగారం తెచ్చుట, పొంగు పాల యాగము అనంతరం బొల్లావుల యుద్ధం రాత్రికి గంగా కాటమ రాజు కథ అత్యంత వైభవంగా నిర్వహించారు. జాతర సందర్భంగా బంధు మిత్రాదులతో గ్రామం తిరుణాల సందడి నెలకొంది, ఈ సందర్భంగా భక్తులకు పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆదివారం బోనాలతో ప్రారంభమై మద్దిమాను యాగం, సోమవారం బండారు దీవెనలతో జాతర ముగుస్తుందని దేవస్థాన పూజారి ప్రసాద్ ఆచారి తెలిపారు.



## ఘనంగా బక్రీద్ వేడుకలు



**తంబళ్లపల్లె జూన్ 7 ప్రభాతవార్త ః**
మండలం లో శనివారం ముస్లిం సోదరులు బక్రీద్ పండుగను ఘనంగా నిర్వహించుకున్నారు. తంబళ్లపల్లె పెద్ద మసీదు, సిద్ధారెడ్డి గారి పల్లి మసీదు నుండి ముస్లింలు మత ప్రార్థనలతో ఊరేగింపుగా క్రాస్ రోడ్ లోని ఈద్గా వద్దకు చేరుకొని ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా హజరత్ యూసఫ్ బక్రీద్ పండుగ త్యాగానికి నిదర్శనమని ప్రతి ముస్లిం సోదరుడు సోదర భావంతో సాటి మనిషికి సహాయం చేసి నిస్వార్థంగా జీవించాలన్నారు. తన సంపాదనలో పేదలకు సాయం చేస్తూ పరోపకారిగా నిలవాలని సూచించారు. ఈ సందర్భంగా బక్రీద్ పండుగ సందర్భంగా ముస్లిం సోదరులు పండుగ శుభాకాంక్షలు తెలిపి నిరుపేదలకు దానధర్మాలు చేశారు. మండలంలోని గోపిదిన్నె, కొటాల, గంగిరెడ్డిపల్లి, రేణిమకులపల్లి, కుక్క రాజు పల్లి, ఎద్దుల వారి పల్లె, కోసువారిపల్లె మసీదులలో ముస్లిం సోదరులు ఈద్గాల వద్ద ప్రార్థన నిర్వహించి పండుగ శుభాకాంక్షల అందజేశారు. ఈ కార్యక్రమంలో బాఘ సాహెబ్, మహబూబ్ పీర్, ఆమీన్ పీర్, గులాం, ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

## వైభవంగా ప్రారంభమైన జ్యేష్ఠ పూజ కార్యక్రమలు

**గోపవరం , జూన్ 7, ప్రభాతవార్త**



బద్వేల్ నియోజకవర్గం వల్లెరవారి పల్లె గ్రామంలో వెలసిన స్వయంభు శ్రీ లక్ష్మి నరసింహా స్వామి దేవస్థానం నందు జ్యేష్ఠ మాసం సందర్భంగా శనివారం వేకువ జామున నుంచి స్వామి వారికి ప్రత్యేక అభిషేకం పూజ కార్యక్రమం నిర్వహించడం జరిగినది. తదుపరి ఆలయ నిర్వాహకులు మాట్లాడుతూ స్వయంభూ శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం నుండి శ్రీ పెనుశిల శ్రీ లక్ష్మీనరసింహస్వామి(పెంచలకోన) దేవస్థానం వరకు ఈనెల 15వ తేదీ ఆదివారం ఉదయం 5 గంటలకు పాదయాత్ర ప్రారంభమవుతుందని, పాదయాత్ర లో పాల్గొనదలచిన బద్వేల్ పట్టణ పరిసర ప్రాంతాల వారు ఆలయం వద్దకు 4:30 కి చేరుకోవలసినదిగా, మిగిలిన ప్రాంతాలవారు మీరు మీ(దారి మధ్య లో అయినా మీ ఊరి కి వెసులుబాటును బట్టి )వీలును బట్టి పాదయాత్ర లో పాల్గొనవచ్చని, వసతి, మూడు పూటలా అన్న ప్రసాదము, తిరిగి మరల మీరు మీ గృహము చేరువరకు వాహన సౌకర్యం ఏర్పాట్లు చేశామని తెలియజేశారు. తదుపరి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మదకరవారి పల్లె గ్రామానికి చెందిన పాటూరి వెంకట రెడ్డి సతీమణి కార్యక్రమంలో పలువురు ప్రముఖులు గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

## షైనింగ్ స్టార్ అవార్డ్సను కైవసం

**సిద్ధవటం జూన్ 7 ప్రభాతవార్త**



రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటుచేసిన షైనింగ్ స్టార్ అవార్డ్స్ కు ముగ్గురు విద్యార్థులు ఎంపిక అయ్యారని పాఠశాల అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ లక్ష్మణస్వామి తెలియజేశారు. వీరు మాట్లాడుతూ 2024 25 విద్యా సంవత్సరంలో పదవ తరగతిలో అత్యంత ప్రతిభ కనపరచి షైనింగ్ సార్ అవార్డుకు ఎంపిక కావడం చాలా సంతోషకరమని అన్నారు. అందులో పి చంద్రిక 590 మార్కులు , వి.నిత్య 580 మార్కులు, డి.భాగ్యలక్ష్మి సాయి 579 మార్కులు సాధించి ఈ షైనింగ్ స్టార్ అవార్డ్స్ కు ఎంపికయ్యారని వారు తెలిపారు. ఈ విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ బాలుగారి వెంకటసుబ్బయ్య అభినందించారు వీరు మాట్లాడుతూ మండలానికి ప్రభుత్వం ఆరు అవార్డులను ప్రకటించగా అందులో శ్రీ నలంద పాఠశాల నుంచి ముగ్గురు విద్యార్థులు ఎంపిక కావడం ఆనందాయకం అని వీరు అన్నారు. ఈ ముగ్గురు విద్యార్థులకు ఒక్కొక్కరికి జ్ఞాపిక, 20000 రూపాయల నగదు బహుమతి మరియు ప్రశంసాపత్రం ప్రభుత్వం తరపున అందజేయడం జరుగుతుంది వీరు తెలిపారు. అంతేకాకుండా ఇంతటి ఘన విజయాన్ని సాధించడానికి సహకరించిన అధ్యాపక బృందానికి తోడ్పాటును అందించిన తల్లిదండ్రులకు,విద్యార్థిని విద్యార్థులకు ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు.

## లక్ష్మీ నరసింహాస్వామి వార్సికోత్సవం

**మదనపల్లె, జూన్ 7 ప్రభాతవార్త :**



పట్టణ సమీపంలోని అనపగుట్ట శ్రీవారినగర్‌లో వెలసియున్న శ్రీ అభయ లక్ష్మినరసింహాస్వామి ఆలయంలో శనివారం స్వామివారి 11వ వార్షికోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు రమేష్‌స్వామి, ఛైర్మెన్ దయ్యాల మల్‌రెడ్డిల ఆధ్వర్యంలో వార్షికోత్సవ పూజలు ఘనంగా జరిగాయి. తెల్లవారిజామునే స్వామివారికి, అమ్మవారికి విశేష ద్రవ్య అభిషేకం, ప్రత్యేక అలంకరణ చేశారు. వందలాదిమంది భక్తులు స్వామివారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయమంతా మామిడి తోరణాలతో ప్రత్యేక అలంకరణ చేశారు. ఆదివారం కూడా స్వాతి నక్షత్రం సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక అలంకరణ చేసి వైభవంగా పూజలు చేయనున్నారు. పలు ప్రాంతాల నుంచి భక్తులు విచ్చేసి శ్రీ అభయ లక్ష్మినరసింహాస్వామిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

## త్యాగ నిరతకు ప్రతీక బక్రీద్ పండగ



**జమ్మలమడుగు, జూన్ 7, ప్రభాతవార్త:**
మహమ్మద్ ప్రవక్త ఇబ్రహీం ప్రత్యేకంగా ప్రపంచ మానవాళి బక్రీద్ పండగ నిర్వహించుకుంటున్నారని ముఫ్తీ కరీముల్లా పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని బీసీ కాలనీలో ఉన్న యాసీన్ మస్జీద్ (మర్కజ్) నందు వేలాది మంది ముస్లిం సోదరులతో కలిసి పవిత్ర బక్రీద్ పండగ నమాజు ఆచరించారు. ముందుగా ప్రవక్త ఇబ్రహీం జీవిత కాలంలో చూపించిన మహిమలు గురించి బక్రీద్ పండగ విశిష్టత గురించి భక్తులకు వివరించారు. బక్రీద్ పండగ విశిష్టతపై గొప్పగా ప్రసంగించారు. అల్లాహ్ ఆదేశాన్ని పాటిస్తూ ప్రవక్త ఇబ్రహీం (అలైహిస్సలాం) యొక్క గొప్ప త్యాగానికి గుర్తుగా మానవాళి ప్రతి ఒక్కరూ బక్రీద్ పండగ జరుపుకుంటటారని తెలిపారు. స్వార్థం, అసూయ, రాగ ద్వేషాలు లేని త్యాగ నిరతిని వ్యాపింపచేయడమే బక్రీద్ పండగ ముఖ్య ఉద్దేశమన్నారు. అన్ని గుణాల కన్నా త్యాగ గుణమే ఉత్తమమన్నది బక్రీద్ సారాంశమని హజరత్ ఇబ్రహీం త్యాగ నిరతిని స్మరించుకుంటూ బక్రీద్ పండగను భక్తిశ్రద్ధలతో జరుపుకుంటున్న ముస్లిం సోదర సోదరీమణులు అందరికీ బక్రీద్ పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మదరసాయే రియాజుల్ వులూమ్ ముఫ్తి సయ్యద్ అహ్మద్ సయీద్, మస్జీద్ యాసీన్ పెద్దలు షేక్ మగ్బుల్ బాషా, షేక్ ఉస్మాన్ బాషా, మహ్మద్ హనీఫ్, కమిటీ పెద్దలు, వేలాది సంఖ్య లో ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

## రాహిత్యకు చమర్తి అభినందన...



**రాజంపేట అర్బన్, జూన్ 7 ప్రభాతవార్త**
పదవ తరగతి పరీక్షా ఫలితాలలో 596/600 మార్కులు సాధించిన రాజు స్కూ ల్ విద్యార్థి ఇండ్లూరి రెడ్డి రాహిత్యను కరస్పాండెంట్ చమర్తి జగన్మోహన్ రాజు అభినందించారు .. స్థానిక రాజు హై స్కూల్లో శనివారం ప్రిన్సిపల్ వి. మోహన్ రెడ్డి తో కలిసి రెడ్డి రాహిత్యకు ప్రశంసా పత్రం షీల్డ్ ను జగన్మోహన్‌రాజు అందజేశారు. ఈ సందర్భంగా జగన్మోహన్ రాజు మాట్లాడుతూ విద్యార్థులు విద్యపై మక్కువతో విద్యను అభ్యసించాలని కోరారు. తమ రాజంపేట పాఠశాల నుంచి ముగ్గురు విద్యార్థులకు ప్రతి అవార్డులు తగ్గటం ఎంతో గర్వకారణంగా ఉందన్నారు. క్రమశిక్షణ కలిగిన విద్యను అందించడం తమ కళాశాలల ప్రత్యేకతని తెలియజేశారు.

### ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ ఫలితాల్లో

## మదనపల్లె జూనియర్ విద్యార్థుల ప్రతిభ

**మదనపల్లి క్రైమ్, జూన్ 7 ప్రభాతవార్త.**
ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ ఫలితాలలో మదనపల్లె జూనియర్ కళాశాల అద్భుతమైన విజయాన్ని సాధించింది. కళాశాల నుండి మొత్తం 71 మంది విద్యార్థులు విజయ ప్రభంజనం సృష్టించి తమ ప్రతిభను చాటుకున్నారు. మొదటి సంవత్సరం విద్యార్థులు వివిధ విభాగాలలో విశేష ఫలితాలను సాధించారు. ఈ సప్లిమెంటరీ పరీక్షలలో కళాశాల ఉత్తీర్ణత శాతం 95 సాధించినట్లు కళాశాల కరస్పాండెంట్ మహేష్ తెలిపారు. ఎం.పి.సి. విభాగం లో 470 మార్కులకు గాను పి. గంగోత్రి 466 మార్కులు సాధించి టౌన్ 1లో మొదటి స్థానం, స్టేట్ లో 2వ ర్యాంక్ సాధించిందని తెలిపారు. అలాగే బి. ధక్షిత్ 465 మార్కులు, భాను తేజ 465 మార్కులు, ఎస్. ఎండి. సిద్దిక్ 465 మార్కులు, బి. జయ హర్షిత 464 మార్కులు, పి. సోమ శేఖర్ 463 మార్కులు, జి. మోర్య తేజ 463 మార్కులు సాధించారు. బై.పి.సి. విభాగం లో 440 మార్కులకు గాను కె. అనీష 428 మార్కులు, ఎం. పద్మప్రియ 426 మార్కులు, కె. ఎస్. ప్రియ: 421 మార్కులు సాధించాగా, సి.ఈ.సి విభాగంలో 500 కె. రెడ్డి భాను 460 మార్కులు సాధించారన్నారు. కళాశాల యాజమాన్యం తమ విజయాన్ని సాధించిన విద్యార్థులందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు.

## పేకాట స్థావరంపై దాడి 5 మంది అరెస్ట్..

**సుండుపల్లె, జూన్ 7, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని ముదుంపాడు పంచాయతీ తిమ్మారెడ్డిగారిపల్లి సమీపంలో పేకాట స్థావరంపై మండల ఎస్సై ముత్యాల శ్రీనివాసులు సిబ్బందితో వెళ్లి దాడి చేసి ఐదు మంది పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు వారి వద్ద నుండి 37,300 నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## ఇంటర్ సప్లమెంటరీ పరీక్షల ఫలితాలు విడుదల

**ఎడ్యుకేషన్ జూన్ 7 ప్రభాతవార్త :**
బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్, ఆంధ్ర ప్రదేశ్ (BIEAP) ఈ ఫలితాలను ఇంటర్ ఫస్ట్ ఇయర్, సెకండ్ ఇయర్ సప్లిమెంటరీ పరీక్షలకు సంబంధించిన ఫలితాలను విడుదల చేశారు. ఈ పరీక్షలు మే 12 నుంచి మే 20, 2025 వరకు జరిగాయి. ఫస్ట్ ఇయర్ సప్లమెంటరీ (First Year Supplementary) పరీక్షలకు 1,35,826 మంది, సెకండ్ ఇయర్‌కు 97,963 మంది విద్యార్థులు సప్లిమెంటరీ పరీక్షలు రాశారు. జిల్లా వ్యాప్త ఫలితాల్లో1st ఇయర్ విద్యార్థులలో ఉత్తీర్ణతా శాతం 43 (apperared 5315, passed 2266). 2nd ఇయర్ ఉత్తీర్ణతా శాతం 62 (appered 3836, passed 2384) సాధించిదని, కడప జిల్లా 1st ఇయర్ మరి యు 2nd ఇయర్ రెండింటి లోను ఫలితాళలో 15 వ స్థానంలో నిలిచింది సప్లిమెంటరీ ఫలితాలను చెక్ చేసుకోవాలి అనుకునే విద్యార్థులు మన మిత్ర వాట్సాప్ నంబర్ 9552300009 అనే నంబర్‌కు వాట్సాప్ చేయడం ద్వారా పొందవచ్చు. అంతే కాకుండా https://resultsbie.ap.gov.in/ వెబ్ సైట్‌లో కూడా చెక్ చేసుకోవచ్చు. 2024,25 విద్యా సంవత్సరానికి టెన్త్, ఇంటర్లో ఎక్కువ మార్కులు సాధించిన ప్రభుత్వ, ప్రైవేటు విద్యార్థులను మండల వారిగా ఎంపిక చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. వాళ్లకి ఈ షైనింగ్ స్టార్ అవార్డులు ఇవ్వాలని తెలియజేసింది. ఇంటర్ పరీక్ష ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు షైనింగ్ స్టార్ పేరిట అవార్డులు ఇవ్వాలని నిర్ణయించింది.

## శ్రీ సాయి వికాస్ విద్యార్థులకు ప్రతిభా అవార్డులు

**చిట్వేలి, జూన్ 7, ప్రభాతవార్త:**



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రకటించిన ప్రతిభ అవార్డులకుగాను చిట్వేలి, చక్రంపేట తమ పాఠశాలల నుంచి 5 మంది విద్యార్థులు ఎంపికైనట్లు శ్రీ సాయి వికాస్ హై స్కూల్ కరస్పాండెంట్ తిరుమల రెడ్డయ్య శనివారం వివరాలను వెల్లడించారు. పది పరీక్ష ఫలితాలలో 600 మార్కులకు గాను;యు.జోష్విత 593, ఎస్ మస్తాన్ 590, బి ప్రణవి 580, ఆర్ ప్రణవి 578, జె లిఖిత 554 మార్కులతో మండలం లో అగ్రస్థానంలో నిలిచారన్నారు. ప్రతిభ పురస్కారాలు పొందిన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలుపుతూ బోధనా సిబ్బందికి, పిల్లల తల్లిదండ్రులకు కరస్పాండెంట్ రెడ్డయ్య అభినందనలు తెలియపరిచారు.

## భక్తి శ్రద్ధలతో బక్రీద్ వేడుకలు..



**సుండుపల్లి, జూన్ 7, ప్రభాతవార్త :**
త్యాగాలకు ప్రతీక బక్రీద్ పండగ అని ఈద్గాల వద్ద ప్రార్థనలో మసీదు పెద్దలు ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో ఘనంగా బక్రీద్ వేడుకలను జరుపుకున్నారు. మండల వ్యాప్తంగా ముస్లిం సోదరులు బక్రీద్ పండుగవేడుకలను శనివారం ఘనంగా జరుపుకున్నారు. ముస్లిం మైనారిటీ సోదరులు ఉదయాన్నే తమ గ్రామాల సమీపంలోని ఈద్గాల వద్దకు వెళ్లి మసీదు మత పెద్దలు ఇచ్చే సారాంశాన్ని విని దానం సాయం త్యాగం వంటి సుగుణాలు కలిగిన బక్రీద్ పండుగను ప్రజల్లో ఘనంగా జరుపుకోవాలని తమకు ఉన్నదాంట్లో పేదలకు సహాయ సహకారాలు అందించాలన్నారు.బక్రీద్ పండగ అంటేనే దాన గుణాలకు సంబంధించిందని పండుగ రోజు దానధర్మాలు చేస్తే ఆ అల్లా క్షమిస్తాడని తెలియజేశారు. సమాజ హితం కోసం మహమ్మద్ ప్రవక్త హజరత్ ఇబ్రహీం త్యాగానికి ప్రత్యేకగా బక్రీద్ పండుగను జరుపుకోవాలని బోధించాడన్నారు. మండల వ్యాప్తంగా ఉన్న ముస్లిం మైనార్టీ సోదరులు తమ ఈద్గాలలో ప్రార్థనలు చేసిన అనంతరం ఒకరికి ఒకరు ఆలింగణం చేసుకొని బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

## తపస్యా విద్యార్థుల విజయకేతనం

**పులివెందుల,జూన్ 7,ప్రభాత వార్త:**
పులివెందుల పట్టణంలోని స్థానిక తపస్య జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థులు ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాలలో విజయదుంబిది ముగించారు. ద్వితీయ సంవత్సరం ఫలితాలలో వి. జోస్నా 983 మార్కులు, అలాగే మొదటి సంవత్సరం ఫలితాలలో ఉత్రిక్ష 465 మార్కులు సాధించి పట్టణంలోని ప్రథమ స్థానాన్ని సాధించి విజయకేతనం ఎగరవేశాలని కళాశాల కరస్పాండెంట్ చంద్ర ప్రసాద్ రెడ్డి తెలిపారు. శనివారం విడుదల చేసిన ఇంటర్ ఫలితాలలో సాధించిన విద్యార్థులకు ప్రిన్సిపల్ రవిశంకర్ రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ సుదర్శన్ రెడ్డి అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

## ఉత్తమ ఫలితాలు సాధించిన గౌతమ్ కళాశాల విద్యార్థులు

**బద్వేల్ అర్బన్, జూన్ 7, ప్రభాతవార్త**
2025 వ సంవత్సరం మే నెలలో జరిగిన సప్లిమెంటరీ ఇంప్రూవ్మెంట్ ఇంటర్ పరీక్షలకు సంబంధించి శనివారం వెలువడిన ఫలితాలలో బద్వేల్ గౌతమ్ జూనియర్ కళాశాల విద్యార్థులు జిల్లా ఫస్ట్ మార్కులు సాధించినట్లు కళాశాల ప్రిన్సిపల్ రవికుమార్ రెడ్డి ,కరెస్పాండెంట్ సౌజన్య లక్ష్మీలు శనివారం ఒక ప్రకటనలు తెలిపారు. ఫలితాలలో భాగంగా జూనియర్ ఇంటర్ ఎంపీసీ నందు ఎస్ఎండీ రషీద్ 467 మార్కులతో స్టేట్ 2 వ ర్యాంకుతో పాటు జిల్లా మరియు టౌన్ ఫస్ట్‌గా నిలిచారన్నారు .465 మార్కులతో రిజ్వానా టౌన్ సెకండ్, 464 మార్కుల తో టౌన్ థర్డ్ గా ఆర్ .చక్రధర్, ప్రవల్లిక మరియు. బాలాజీ లు 463 మార్కుల తో టౌన్ నాలుగో స్థానంలో నిలిచారన్నారు అలాగే వీరితోపాటు గా ఆర్షియా మరియు బి .వరుణ్, అభినయ్ లు 461 మార్కులు సాధించారన్నారు. అంతేగాక బైపిసి నందు బి. సవ్య 429, జి యశస్విని 414, రూబియా 410 వంటి మార్కులు సాధించడంతోపాటు 28 మంది విద్యార్థులు 600 పైగా మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ ,కరస్పాండెంట్ లు తెలిపారు.

## ఉపాధి హామీ శ్రామికులకు మజ్జిగ పంపిణీ

**పోరుమామిళ్ల రూరల్, జూన్ 7 ప్రభాతవార్త:**
పోరుమామిళ్ల జనసేన మండల నాయకుడు నగిరి రమణయ్య శనివారం ఉదయం 10 గంటలకు రంగసముద్రం గ్రామపంచాయతీ ఉపాధి హామీ శ్రామికులకు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పోరుమామిళ్ల జనసేన నాయకులు రామాయణ రామ్మోహన్, పాత కడప సిద్దయ్య పిన్నం గురప్ప ,నగిరి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



ఉపాధి కూలీలకు మజ్జిగ పంపిణీ చేస్తున్న నాయకులు

# దివ్యాంగులకు అందుబాటులో ఉండాలి

(ఈ-గవర్నెన్స్ ప్లాట్‌ఫామ్‌లు, డిజిటల్ చెల్లింపు వ్యవస్థలు, ప్రభుత్వ వెబ్‌సైట్లు) (సుప్రీం కోర్టు తీర్పు)

**బద్వేలు లీగల్, జూన్ 07 ప్రభాతవార్త :**
భారత రాజ్యాంగంలోని 21వ అధికరణ ప్రకారం డిజిటల్ యాక్సస్ హక్కు జీవించే హక్కులో భాగం అని సుప్రీం కోర్టు ప్రకటిస్తూ యాసిడ్ దాడులు, ప్రమాదాలు మొదలైన వాటి కారణంగా ముఖం మారిపోయినా మరియు దృష్టి దోషం ఉన్న వ్యక్తులకు ఈ-కేవైసీ ప్రక్రియ అందుబాటులో ఉండేలా చూసుకోవాలని ఏప్రిల్ 30న వెలువరించిన కీలక తీర్పులో సుప్రీం కోర్టు కొన్ని ఆదేశాలను జారీ చేసింది. ఈ మేరకు ఎలక్ట్రానిక్, ప్రింట్ మీడియా రెండూ వికలాంగులకు అందుబాటులో ఉండాలని తెలిపే వికలాంగుల హక్కుల చట్టం–2016 నందలి సెక్షన్–46 కు అన్ని ప్రభుత్వ వెబ్‌సైట్లు కట్టుబడి ఉండటం తప్పనిసరి అని కూడా స్పష్టం చేసింది. ఈ-గవర్నెన్స్ ప్లాట్‌ఫామ్‌లు, డిజిటల్ చెల్లింపు వ్యవస్థలు, ఈ-లాంచింగ్ ప్లాట్‌ఫామ్‌లతో సహా అన్ని ఆన్‌లైన్ సేవలు వికలాంగులకు అందుబాటులో ఉండాలి, ఈ-కేవైసీ ప్రక్రియలో పాల్గొనడంలో వికలాంగులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అంగీకరిస్తూ సుప్రీం కోర్టు కొన్ని ఆదేశాలు కూడా జారీ చేసింది. అంధత్వం లేదా దృష్టి లోపం ఉన్న వ్యక్తులు యాసిడ్ దాడి బాధితులు, డిజిటల్ కేవైసీ లేదా ఈ-కేవైసీ లేదా వీడియో కేవైసీ నిర్వహించాలని కూడా ఆదేశాలతో కూడిన మార్గదర్శకాలు జారీ చేయాలని కోరుతూ దాఖలైన రెండు రిట్ పిటీషన్లలో జస్టిస్ జె.బి.పార్థివాలా, జస్టిస్ ఆర్. మహదేవన్‌లతో కూడిన ధర్మాసనం ఈ తీర్పును ప్రకటించింది. కష్టమర్ల ఫోటోలు తీయడానికి ప్రత్యామ్నాయ పద్ధతులను ప్రవేశపెట్టే విషయమై మార్గదర్శకాలను జారీ చేయాలని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాను కూడా ఆదేశించింది. యాసిడ్ దాడుల బాధితులు మొదటి పిటీషన్‌లో లేవనెత్తిన వాదనలలో ఇది ఒకటి. డిజిటల్ కేవైసీ ప్రక్రియ సమయంలో బ్రొటన వ్రేలు ముద్రను అంగీకరించాలని కోర్టు అధికారులను ఆదేశించింది. ఇది అంధత్వం, దృష్టి లోపం ఉన్న వ్యక్తుల కోసం రెండవ పిటీషన్‌లో లేవనెత్తిన వాదన. (అమర్ జైన్ ఎదిరి యూనియన్ ఆఫ్ ఇండియా అండ్ అదర్స్ డబ్ల్యుపి(సి) నెం.49/2025 మరియు ప్రజ్ఞా ప్రసూన్ ఎదిరి యూనియన్ ఆఫ్ ఇండియా డబ్ల్యుపి(సి) నెం.289 /2024)








అన్నమయ్య జిల్లా
నందలూరు, ఓబులవారిపల్లె,
రైల్వేకోడూరు, రాయచోటి అర్బన్

కడప జిల్లా
మైదుకూరు అర్బన్, జమ్మలమడుగు అర్బన్,
మైలవరం, సికెదిన్నె, కొండాపురం

ఇంటర్వ్యూ తేదిలు : 09.06.2025 నుండి 15.06.2025 వరకు మీ పూర్తి బయోడేటాతో ఈ క్రింది చిరునామాలో సంప్రదించగలరు.

వార్త కార్యాలయం, డోర్ నెం. 1-2237, హౌసింగ్ బోర్డు కాలని, విశ్వేశ్వరయ్య సర్కిల్ దగ్గర, రైల్వేస్టేషన్ రోడ్డు, కడప.
సెల్ నెం. 9848787289, 8919566086